యువతిని బలవన్మరణానికి ప్రేరేపించిన ప్రియుడు

ఆన్‌లైన్ పేమెంట్‌తో పురుగుమందు కొనిచ్చిన ఉన్మాదం

సర్పవరం జంక్షన్(కాకినాడ), న్యూస్‌టుడే: 'ప్రేమించానన్నాడు. చనువు పెంచుకున్నాడు. కొన్నాళ్లకే మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యాడు. నిలదీసిన ప్రియురాలికి పురుగుమందు కొనిచ్చి.. ఆమె బలవన్మరణానికి కారణమయ్యాడు. ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకినాడ గ్రామీణంలోని సర్పవరం స్టేషన్ సీఐ పెద్దిరాజు వివరాల ప్రకారం.. ఉప్పాడ కొత్తపల్లి మండలం ఇసుకపల్లికి చెందిన ములికి ఉమామహేశ్వరరావు కాకినాడ నగరంలోని గొడారి గుంటకు చెందిన యువతి(24)ని 2017 నుంచి ప్రేమిస్తూవచ్చాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి చనువుగా మెలిగాడు. అందుకు పెద్దలు ఒప్పుకోవడం లేదని చెప్పుకొచ్చాడు. ఇటీవల మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. విషయం తెలిసిన అతని ప్రియురాలు ఈ నెల 14న అతన్ని నిలదీయడంతో చస్తే చావు, నా పెళ్లికి అడ్డురాకు అంటూ ఆత్మహత్యకు ప్రేరేపించగా పురుగుమందు కొనేందుకు దుకాణానికి వెళ్లింది. ఆమె అడ్డు తొలగించుకోవాలని భావించిన ఉమామహేశ్వరావు ఆన్‌లైన్ ద్వారా దుకాణ యజమానికి నగదు చెల్లించి ప్రియురాలికి పురుగుమందు కొనిచ్చాడు. అది తాగి ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో సర్పవరం పోలీసులు ఉమామహేశ్వరావును మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

27న టీటీసీ పరీక్ష

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) కోర్సు లోయర్ గ్రేడ్ థియరీ పరీక్ష ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్‌తో పాటు అందుబాటులో ఉన్న ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డు వీటిలో ఏదైనా ఒరిజినల్ తీసుకురావాలని సూచించారు.

తూర్పు తీరాన.. వీచేనా ఐటీ వీచిక

▪ కీలక రంగానికి అనువైన వనరులు పుష్కలం ▪ కూటమి ప్రభుత్వ నిర్ణయంతో కొత్త ఆశలు

■ **గతం:** గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఐటీ రంగానికి ప్రోత్సాహం కరవు. కనీస రోడ్లు, వీధి దీపాలు ఇతర సదుపాయాలు కల్పించలేని పరిస్థితుల్లో చాలా సంస్థలు మూతపడ్డాయి.

■ **ప్రస్తుతం:** రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో ఐటీ రంగంలో రూ. 20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రెండు లక్షల మందికి ఉపాధి కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2024-29 ముసాయిదా ఐటీ విధానం సిద్ధం చేసింది.


ఈనాడు, కాకినాడ

కాకినాడ, రాజమహేంద్రవరం.. ఈ రెండు నగరాలు ఐటీ రంగానికి కీలకం.. రేపటి వైపు ఐటీ పట్టణాలు. విశాఖలో హార్డ్‌వేర్‌తో వృద్ధులు స్తంభించిపోతే.. ఈ రెండు పోటీనందే కార్యకలాపాలు సాగాలి. వైకాపా ప్రభుత్వం వచ్చాక పూర్తిగా నీరుగార్చింది. కూటమి ప్రభుత్వంతో ఆశలు చిగురించాయి. తూర్పు తీరాన అంతరాలు, అనువైన వనరులు, సాఫ్ట్‌వేర్ రంగానికి ఊతం దక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అవకాశాలెన్నో..

రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి రోజువారీ విమానయాన సౌకర్యం ఉంది. కోల్‌కతా నుంచి చెన్నై వరకు ప్రధాన రైల్వే లైను హైదరాబాద్, ఇతర నగరాలను కలుపుతూ ఉంది. పోర్టులు, పరిశ్రమలతో వ్యాపార, వాణిజ్య రంగంలో ఇప్పటికే అభివృద్ధి చెందింది.

■ జేఎన్‌టీయూకే, నన్నయ విశ్వవిద్యాలయంతోపాటు.. ప్రధాన విద్యాసంస్థలు, కళాశాలల నుంచి ఏటా 15వేల మందికి పైగా సాంకేతిక విద్య పూర్తిచేస్తున్నారు. స్థానిక ఐటీ పరిశ్రమలో వీరి ప్రతిభకు పోటీనే ఆవిష్కరణలకు ఊతమిస్తాయి. కోర్ ఐటీ సేవలు, గ్రామీణ ఐటీ, ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, అగ్రిటెక్, పరిశ్రమల అభివృద్ధికి, ప్రగతికి ఆస్కారం ఉంది.



కాకినాడ గ్రామీణం ఆటోనగర్‌లోని ఐటీ సెజ్‌లో అంకుర కేంద్రం

రాష్ట్రంలో నాలుగు ఐటీ చాప్టర్లు ఉంటే.. అందులో ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటీఏఏపీ) గోదావరి చాప్టర్ ఒకటి. దీని పరిధిలో ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలు ఉభయ గోదావరి జిల్లాల్లో 55 వరకు ఉంటే.. 10వేల మంది పనిచేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, మొబైల్ అప్లికేషన్, ఏఐ, డేటా, క్లినికల్ ట్రైల్ ప్రొడక్ట్స్, బిజినెస్ ప్రాసెస్, గ్లోబల్ సోర్సింగ్, మ్యాపింగ్ సొల్యూషన్, డేటా సర్వీసెస్ కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

■ కాకినాడ కలెక్టరేట్‌లో గోదావరి ఐటీ కేంద్రం 'సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా' అంకుర సంస్థలకు ఊతమిచ్చే వేదిక ఉంది. సర్పవరం ఆటోనగర్‌లోని ఐటీ సెజ్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఉంది. క్రిపై సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్, ఆదిత్య టెక్నాలజీస్, ఇండియా, నైబుంట్, ఐడియా ఇండియా, ప్రైమ్ సాఫ్ట్ ఇండియా, నైరోస్ టెక్నాలజీస్, ఐప్రో గ్లోబల్ సర్వీసెస్, వినూత్న ఐటీ సర్వీసెస్, సన్‌రైజ్ సొల్యూషన్స్ ఉన్నాయి.

ఊతమిస్తే కొత్త ఊపు..

ఉమ్మడి జిల్లాలో ఐటీ కారిడార్ కార్యరూపం దాల్చాలి. ఆటోనగర్‌లోని ఐటీ సెజ్‌లో ఇంక్యుబేషన్ సెంటర్లకు వైభవం తేవాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పెరిగేలా ప్రోత్సహించాలి. ఐటీ పరిశ్రమలకు అనువైన భూములు ఇవ్వడం, ప్రస్తుతం ఉన్న ప్రాంగణాలు మరియు వసతులు తేవాలి. ఐటీ పార్కులు, కోవర్కింగ్ స్పేస్‌ల అభివృద్ధికి రాయితీలు, పన్ను ప్రయోజనాలు కల్పిస్తే ఉపయుక్తం.

కాకినాడ ఐటీ సెజ్ నుంచి సర్పవరం వరకు రహదారి అధ్వానం. రతన్ టవర్స్‌కు వెళ్లే మార్గంలో వీధి దీపాలు, సదుపాయాలు లేవు.. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి కాకినాడ కలిపే ఏడీబీ రోడ్డు మెరుగుపరచాల్సి ఉంది.

అనువైన ప్రాంతమిది..



రాష్ట్రంలో బలమైన ఐటీ కేంద్రంగా మారడానికి అనువైన ప్రాంతం ఇది. ఉద్యోగావకాశాలతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. గోదావరి చాప్టర్ పరిధిలో పెట్టుబడిదారుల సమస్యలు విశాఖలో జరిగిన ఇంటరాక్టివ్ సమావేశంలో మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాం.
- కొవ్వూరి కృష్ణారెడ్డి, పూర్వ ఛైర్మన్, ఐటీఏఏపీ గోదావరి చాప్టర్/ సీఈవో, క్రిపై సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్

జ్ఞానమూర్తి.. విశ్వకీర్తి



స్వామివారికి అభిషేక క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

వీణాపాణిగా మలయప్ప స్వామి దర్శనం

ఆత్రేయపురం: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం వీణాపాణిగా, చదువుల తల్లి సరస్వతీ అవతారంలో దర్శనమిచ్చారు. మలయప్పస్వామి వీణ ధరించి హంస వాహనరూఢుడై వివేకాన్ని భక్తులకు బోధిస్తున్నట్లు కనిపించారు. గోవింద నామస్మరణ నడుమ దేవదేవుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ జ్ఞానమూర్తిగా ప్రకాశించారు. తొలుత విష్వక్సేన పూజ, పంచామృత మండపారాధన, స్నపనం, అష్టదళ పాద పద్మారాధన కార్యక్రమాలను పండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల నేతృత్వంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవంలో నేడు: బుధవారం అష్టోత్తర శతకలశాభిషేకం, కోదండరామ అలంకరణలో హనుమత్ వాహన సేవ ఉంటాయి.



శ్రీవారికి అష్టదళ పాదపద్మారాధన



ఆకట్టుకున్న శక్తి వేషధారణలు

మనలేక మరణ శాసనం

■ అంబాజీపేటలో వస్త్ర వ్యాపారి దంపతుల ఆత్మహత్య
■ పదకొండేళ్ల క్రితం కుమారుడి కుటుంబం సైతం బలవన్మరణం

అంబాజీపేట, న్యూస్‌టుడే

ఆర్థిక కష్టాలు, అనారోగ్యం ఆ దంపతులను తీవ్ర మనోవేదనకు గురిచేశాయి. జీవితాంతం ఒకే మాట, బాటగా నడిచినవారు ఇక ఈ ప్రపంచంలో మనలేమంటూ శాశ్వత వీడ్కోలు పలికి అయినవారికి తీరని శోకం మిగిల్చారు. అంబాజీపేటలో మంగళవారం చోటుచేసుకున్న వస్త్ర వ్యాపారి దంపతుల విషాదాంతమిది. సరిగ్గా పదకొండేళ్ల క్రితం వారి కుమారుడు, కోడలు, ఇద్దరు మనుమలు సైతం విష రసాయనం తాగి బలవన్మరణం చెందారు. ఒకే కుటుంబంలో ఆరుగురు ఇలా తనువు చాలించడం కలచివేసింది.

అంబాజీపేట పెద్దవీధికి చెందిన వ్యాపారి పాబోలు రామసుబ్రహ్మణ్యం అలియాస్ రాంబాబు (60), ఆయన భార్య నాగమణి(57) మంగళవారం తెల్లవారుజామున తమ ఇంటిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. పైఅంతస్తు పడకగదిలో రామసుబ్రహ్మణ్యం భార్య విగతజీవిగా పడి ఉన్నారు. రాంబాబు కింది అంతస్తులోని ద్వారానికి ఉన్న ఇనుప గ్రిల్స్‌కు వస్త్రంతో ఉరేసుకొన్నారు.



రామసుబ్రహ్మణ్యం, నాగమణి దంపతులు (పాత చిత్రాలు)

ఎవరూలేని సమయంలో..

రాంబాబు దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుమారుడు వెంకటకిరణ్ 2013లో భార్య లక్ష్మీశ్వేత, కుమార్తె శ్రావణి, 9 నెలల వయసున్న కుమారుడితో సహా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో విష రసాయనం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెద్ద కుమార్తె అమలాపురంలో ఉండగా.. చిన్నకుమార్తె వంకాల సునీత తన బిడ్డ మానసతో కలిసి తల్లి దండ్రుల వద్దే ఉంటున్నారు. రెండు రోజుల క్రితం సునీత విశాఖలో బంధువుల వివాహానికి వెళ్లారు. మంగళవారం తల్లిదండ్రులకు అల్పాహారం తీసుకెళ్లమని స్థానిక యువతికి సునీత ఫోన్‌లో చెప్పారు. ఆమె వెళ్లగా సంఘటన బయటపడింది.



రామసుబ్రహ్మణ్యం మృతదేహాన్ని పరిశీలిస్తున్న నగరం ఎస్సై చైతన్యకుమార్

నాటినుంచి మనోవేదన

రాంబాబు అంబాజీపేట మహిళల ఆసుపత్రి రోడ్డులోను, అయినవిల్లి మండలం సిరిపల్లి వద్ద సుబ్రహ్మణ్యేశ్వర ఆగ్రో ప్రొడక్ట్స్ పేరుతో కొబ్బరినూనె, పామాయిల్ వ్యాపారాలు నిర్వహించేవారు. కముజువారిలంక వద్ద నర్సరీ ఉండేది. నష్టాలు రావడంతో వాటన్నింటిని విక్రయించేశారు. ఏడేళ్ల నుంచి ఇంటివద్దే ఆదిత్య గార్మెంట్స్ పేరుతో వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించారు. ఇందులోనూ ఆర్థిక ఇబ్బందులు చవిచూశారు. దీనికితోడు పదకొండేళ్ల క్రితం కుమారుడి కుటుంబమంతా బలవన్మరణం చెందడంతో మనోవేదనకు గురయ్యారు. ఎన్ని మందులు వాడినా ఆరోగ్యం కుదుట పడకపోవటంతో రాంబాబు దంపతులు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు బంధువులు, పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సంఘటనా స్థలాన్ని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ పరిశీలించారు. అంబాజీపేట ఏఎస్సై వై.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మాచవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. 'నేను మానసిక, ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులతో మనోవేదన చెందుతున్నాను. ఇప్పటివరకు మా దంపతులకు కుమార్తె సునీత, మనుమరాలు చాలా సేవ చేశారు. నా తమ్ముళ్లు కృష్ణ, శ్రీనులు నా కుమార్తెలను కన్నబిడ్డల్లా చూడాలి' అంటూ రాంబాబు రాసిన ఆత్మహత్య లేఖ ఇంటిలో లభించింది.

పిల్లల సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిన్నపిల్లలకు భద్రత, రక్షణ కల్పించేలా ఆయా అంశాలకు ప్రాధాన్యమిస్తూ జిల్లాను చిన్నపిల్లల సురక్షితమైనదిగా తీర్చిదిద్దాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కాకినాడ సీపోర్ట్సు, పడాల ఛారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారుల భద్రత, సంరక్షణ, లైంగిక వేధింపులకు గురికాకుండా కాపాడుకోవడం అనే అంశాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నిత్యం చిన్నారులు ఏదోరకంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారని, తెలిసిన వారి నుంచే వేధింపులు ఎదురవుతుండడం బాధాకరమన్నారు. సురక్షిత స్పర్శ, చెడు స్పర్శ అంశాలపై ప్రభుత్వ, ప్రైవేటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చిన్నారుల రక్షణకు జిల్లాస్థాయిలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి దానికి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. పడాల ఛారిటబుల్ ట్రస్టు సీఈవో సూర్యప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ అంశాలు వివరించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, అదనపు ఎస్పీ భాస్కరరావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, డీఈవో పి.రమేశ్, సీపీవో పి.త్రినాథ, డీపీవో ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, చిత్రంలో శిక్షణ కలెక్టర్ భావన

గొప్ప మానవతావాది శంకరన్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉన్నత ఆదర్శ విలువలు కలిగిన గొప్ప మానవతావాది ఎస్ఆర్‌శంకరన్ అని కలెక్టర్ షాన్‌మోహన్ కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్‌లో సామాజిక హక్కుల వేదిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల ఫోరం ఉమ్మడి జిల్లా ఛైర్మన్ తాటిపాక మధు ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్ అధికారి శంకరన్ 90వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్, శిక్షణ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, డీఆర్వో డి.తిప్పేనాయక్, ఆర్డీవో ఎస్.మల్లిబాబు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు, మధు తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో గుర్తుంచుకునే ఉత్తమ ఐఏఎస్ అధికారుల్లో శంకరన్ ప్రథముడన్నారు. కార్యక్రమంలో అయితాబత్తుల రామేశ్వరరావు, తోకల ప్రసాద్, దూసర్లపూడి రమణరాజు, కామిరెడ్డి బోడకొండ, టి.రాజా, పిట్టా వరప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, పప్పు ఆదినారాయణ, జనార్దన్ పాల్గొన్నారు.

కార్తికమాస ఏర్పాట్లపై 27న సమీక్ష

అన్నవరం, న్యూస్‌టుడే: రానున్న కార్తికమాసంలో అన్నవరం దేవస్థానంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఈనెల 27న వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. పర్వదినాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణ, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ఇతరత్రా ఏర్పాట్లపై చర్చించనున్నారు. తుని, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు.

మద్యం కుంభకోణంపై.. సీఐడీ

☛ డిస్టిలరీల్లో ప్రత్యేక బృందాల సోదాలు
☛ కీలక దస్త్రాలు, హార్డ్‌డిస్కులు స్వాధీనం

ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, అనపర్తి గ్రామీణం, జగ్గంపేట గ్రామీణం, రంగంపేట: వైకాపా ప్రభుత్వంలో ఎన్నడూ వినని బ్రాండ్లు, రకరకాల లేబుళ్లతో నాసిరకం మద్యం మార్కెట్ మెట్లెక్కింది. ప్రజల ఆరోగ్యం దెబ్బతింది. ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎదురయింది. మద్యం దుకాణాల్లో ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం ఇవ్వకపోగా.. పెద్ద ఎత్తున నగదు లావాదేవీలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారు.. ఈ భారీ మద్యం కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో సీఐడీ రంగంలోకి దిగింది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, రంగంపేట మండలాల్లోని మద్యం డిస్టిలరీల్లో సీఐడీ అధికారుల బృందాలు మంగళవారం ముమ్మర తనిఖీలు చేపట్టాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు సుదీర్ఘంగా సోదాలు కొనసాగాయి. ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం పాల్గొని సీఐడీ బృందాలకు సహకారం అందించారు.

మూడుచోట్ల ముమ్మర తనిఖీలు..

● అనపర్తి మండలం కొప్పవరం గ్రామ సమీప బీడీహెచ్ అగ్రో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో విశాఖ సీఐడీ డీఎస్పీ నాగేంద్ర భూపాల్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్సైలు, ఇతర సీఐడీ, ఎక్సైజ్, పోలీసు సిబ్బంది 20 మంది సోదాల్లో పాల్గొన్నారు. గడిచిన ఏడేళ్లుగా ఈ పరిశ్రమ కార్యకలాపాలపై ఆరా తీశారు. 1.20 లక్షల కేసుల సామర్థ్యం ఉన్న ఐఎంఈఎల్ తయారీ పరిశ్రమలో కీలక దస్త్రాలు నిశితంగా పరిశీలించారు. అనుమతులు, ఉత్పత్తుల తీరుపై ఆరా తీశారు.

● రంగంపేట మండలం కోటపాడులో 1.50 కోట్ల సీసాల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పీఎంకే డిస్టిలేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సీఐడీ డీఎస్పీ కుమారస్వామి ఆధ్వర్యంలో 15 మంది సోదాల్లో పాల్గొన్నారు. ఎక్సైజ్ డిస్టిలేషన్, పోలీసు, రెవెన్యూ అధికారులూ ఉన్నారు.

● రంగంపేట మండలం నల్లమిల్లిలోని ప్రాగ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్‌లో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 మంది వరకు సీఐడీ, ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.



అనపర్తి మండలం కొప్పవరం సమీప బీడీహెచ్ అగ్రో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద తనిఖీ బృందం వాహనాలు



రంగంపేట మండలం నల్లమిల్లిలోని ప్రాగ్ డిస్టిలరీ

కీలక ఆధారాలు స్వాధీనం..

తనిఖీల్లో కీలక దస్త్రాలను సీఐడీ బృందం పరిశీలించింది. వాటితో పాటు హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుంది. ఆయా డిస్టిలరీల్లో తయారీలకు ఉన్న అనుమతులు, ఉత్పత్తుల తీరు నిశితంగా పరిశీలించారు. కొన్నిచోట్ల తేడాలు గుర్తించారు. వెలుగుచూసిన లోపాలు, ఇతర అంశాలేవీ బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. ఈ ప్రక్రియ జరుగుతున్నంతసేపు అటువైపు ఇతరులెవ్వరూ వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ప్రధానంగా 2019 నుంచి 2024 మధ్య వైకాపా ప్రభుత్వంలో మద్యం తయారీ, సరఫరాలకు సంబంధించిన దస్త్రాలపై పూర్తిస్థాయిలో సీఐడీ ఆరా తీసినట్లు తెలుస్తోంది.

ఎస్ఎస్ఏ వెబ్‌సైట్‌లో తుది జాబితాలు

కాకినాడ నగరం: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి అభ్యర్థుల ధ్రువీకరణల పరిశీలనానంతరం తుది జాబితాను ప్రకటించినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ ssaegdt.webnode.comలో వివరాలు పరిశీలించుకోవాలని సూచించారు. అభ్యంతరాలుంటే ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎస్ఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



ముక్కొల్లు రెగ్యులేటరు వద్ద నాచు పట్టిన గట్టుపై చిన్నారుల పరుగులు

విహారం చెంతనే.. ప్రమాదం

కిర్లంపూడి మండలం ముక్కొల్లు రెగ్యులేటరు వద్ద జలపాతం అంటూ పిల్లలు, పెద్దలు విహారానికొస్తున్నారు. పిల్లలు ఆడుకుంటున్నారని అనుకుంటే ప్రమాదంలో పడినట్లే.. అక్కడే ప్రమాదం పొంచి ఉందని కొత్తగా వచ్చినవారికి తెలియదు. నిత్యం నీరు పారుతుండే రెగ్యులేటరును ఆనుకుని దిగువన ఉన్న యాప్రాన్ గట్టుకు నాచుపట్టింది. ఇక్కడ సందర్శకులు, చిన్నారులు స్నానాలు చేస్తూ ప్రమాదానికి గురవుతున్నారు. కొందరు పిల్లలు గట్టుపై పరుగులు తీస్తున్నా తల్లిదండ్రులు వారించడం లేదు. ఇప్పటికే అనేక మంది ప్రాణాలను పోగొట్టుకున్నారు. ముందుగా జాగ్రత్త పడకపోతే ప్రాణాలకే ప్రమాదం. - న్యూస్‌టుడే, కిర్లంపూడి

సహకార, నీటి సంఘాల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: రానున్న సహకార, నీటి సంఘాల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి నాయకులు పనిచేయాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. తేటగుంట కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ కూటమి నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. త్వరలో మెగా జాబ్ మేళాను నిర్వహించి 1500 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు యనమల తెలిపారు. నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, గాడిరాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల

కందిపప్పు వచ్చేసింది..!

☛ జిల్లాకు 685 టన్నుల కేటాయింపు ☛ నవంబరులో అన్ని కార్డులపై పంపిణీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బహిరంగ మార్కెట్‌లో ధర పెరిగిన కందిపప్పును రాయితీపై కార్డుదారులకు పంపిణీ చేసేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో పేదలకు రాయితీ కందిపప్పును ఎగ్గొట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గుత్తేదారులను కొత్తగా ఎంపిక చేయడం, కచ్చితమైన తూకం, నాణ్యమైన సరకు సరఫరా చేసే సంస్థలను గుర్తించి బాధ్యతలు అప్పగించారు. ఈనెలలో 30 శాతం కార్డుదారులకు రాయితీ కందిపప్పు అందించారు. వచ్చే నెల నుంచి అన్ని కార్డులపై కేజీ రూ.67 చొప్పున అందించడానికి చర్యలు చేపట్టారు. నవంబరు నెలకు 685 టన్నుల సరఫరాకు ఆమోదం తెలిపారు. ఇప్పటికే 50 శాతం సరకు జిల్లాలోని ఏడు ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరింది. మరో రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో సరకు దిగుమతి అవుతుంది. 21 మండలాల పరిధిలో రేషన్‌కార్డులు 6,54,715 ఉండగా కార్డుకి కేజీ చొప్పున 654 టన్నులు ప్రతీ నెలా అవసరం కాగా నవంబరు నెలకు అదనంగా మరో 30 టన్నులు కేటాయించారు. అలాగే పంచదార కేటాయింపులు కూడా నవంబరు నెలకు నూరు శాతం వచ్చింది. ఏఏవై కార్డుదారులకు కేజీ రూ.14, మిగిలిన వారికి అరకేజీ రూ.17 చొప్పున విక్రయించనున్నారు. వచ్చే నెల 1 నుంచి 17 వరకు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరకుల పంపిణీ చేపట్టనున్నారు. ఈనెల 30 నాటికి జిల్లాలోని తుని, పిఠాపురం, గొల్లప్రోలు, దివిలి, జగ్గంపేట, కాకినాడ, వేళంగిలోని పౌర సరఫరాల సంస్థ గోదాముల నుంచి 1,060 చౌక దుకాణాలకు సరకులు తరలిస్తామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులనాయక్ చెప్పారు. ఈనెల 29లోగా సరకులన్నీ రేషన్ దుకాణాలకు చేరేలా చర్యలు చేపట్టామన్నారు. కందిపప్పు ప్రతీ నెలా నూరు శాతం కార్డుదారులకు అందిస్తామన్నారు.



కందిపప్పు

నవంబరు నెల కేటాయింపులు:

సరకు	టన్నులు
బియ్యం	9333
కందిపప్పు	685
పంచదార	300



ఎండీయూ వాహనం ద్వారా సరకుల పంపిణీ



ఎగిరొచ్చే అందం.. కోరింగతో బంధం

విదేశీ వలస పక్షుల రాకకు సమయం ఆసన్నం



● బ్లాక్ వింగెడ్ స్టిల్ట్



● ఇండియన్ స్కిమ్మర్

సంగీతం వినిపించినట్లు కిలకిలారావాలు.. ఆకాశానికి రంగేసినట్లు కనుచూపు మేర అందాలు. ఎగిసిపడే సముద్ర కెరటాల దగ్గర.. గలగలా పారే గోదావరి తీరాన.. దట్టమైన పచ్చదనం విహంగాల విన్యాసాలు. ఎటుచూసినా కనుల విందే. శీతాకాలం ప్రవేశంతోనే కోరింగలో సందడి వాతావరణం నెలకొంటుంది. సంతానోత్పత్తి, ఆహార అన్వేషణలో భాగంగా వేలకిలోమీటర్లు దాటి ఏటా ఇక్కడికి చేరుకుంటాయి. కాకినాడ జిల్లా కోరింగ అభయారణ్యంలోని మడ అడవుల్లో ఆహారం లభించే చోట ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. ఆరునెలల పాటు ఉండి తిరిగి వెళ్తాయి.

– న్యూస్‌టుడే, తాళ్లరేవు

ఎల్లలు దాటి ప్రయాణం...

సైబీరియా, మంగోలియా, రష్యా, చైనా, ఒడిశాలోని మహానది, చంబల్ ప్రాంతాల నుంచి విదేశీ వలస పక్షులు కోరింగ అభయారణ్యానికి చేరుకుంటాయి. ఇప్పటికే ఐ.పోలవరం మండలం భైరవపాలెనికి ఇండియన్ స్కిమ్మర్ పక్షులు వచ్చాయి. నవంబరు నుంచి మార్చి వరకు ఈ అభయారణ్యంలోని 12 ప్రాంతాల్లో కనిపిస్తాయి. కోరంగిలోని హోప్ ఐలాండ్, కాకినాడ ఏటిమొగ, కుంభాభిషేకం, బీచ్, బ్యాక్ వాటర్ కెనాల్, తాళ్లరేవు మండలం చొల్లంగి ఉప్పు మడులు, గాడిమొగ, కాట్రేనికోన మండలం సాంక్రిమెంట్, పండి, పొర, ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం జి.కె.పొర ప్రాంతాల్లో విహరిస్తాయి.



జి.కె.పొర వద్ద వలస పక్షులకు అనువైన ప్రాంతం ఉంది. మడ అడవులు, చిత్తడి నేలలు వీటికి ఆహారం దొరికే ప్రాంతాలు.



● రఫ్స్

ఆహార అన్వేషణ..

సైబీరియా, మంగోలియా, రష్యా, చైనా వంటి దేశాల్లో పక్షులు ఉండే ప్రదేశాలు ఈ సీజన్‌లో మంచుతో కప్పేసి ఉంటాయి. ఆహార కొరత, ప్రతికూల పరిస్థితుల కారణంగా అక్టోబరు నుంచి మార్చి వరకు ఇక్కడికి చేరుకుంటాయి. నత్తలు, చేపలు, జూప్లాంట్, వామస్ ఆహారాన్ని అధికంగా తింటాయి.

2024లో గుర్తించిన జాతులు: 108
కోరింగ అభయారణ్యం విస్తీర్ణం: 235.76 చ.కి.మీ.
పొడవు: 15 కిలోమీటర్లు
మడ అడవులు: 193 హెక్టార్లు

జనవరిలో గణన..

ఏటా జనవరిలో విదేశాల నుంచి వచ్చే పక్షులను లెక్కిస్తారు. ఇందులో వివిధ సంస్థలు పాల్గొంటాయి. ఒక్కో చోట అయిదుగురు చొప్పున 12 ప్రాంతాల్లో 12 బృందాలను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక కెమెరాల ద్వారా పక్షులను గుర్తిస్తారు. 2011లో ప్రారంభమైన ఈ ప్రక్రియ ఏటా కొనసాగుతోంది. 2016 నుంచి పక్షుల సంఖ్య పెరుగుదల కనిపిస్తోంది. స్కిమ్మర్ అంతరించిపోతున్న పక్షుల జాబితాలో చేరడం గమనార్హం.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని పీడీఎఫ్ పూర్వ ఎమ్మెల్సీ [illegible] బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక కేవీఆర్ ప్రసాద్ హోమ్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ [illegible] పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. యూటీఎఫ్ కార్యాలయం పక్కనే ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని మార్చాలని అధికారులను కోరారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంకే వెంకటేశ్వరరావు, ఎంటీవీ సుబ్బారావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, ఈవీఎస్ఎన్ఆర్ ప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీవీ నగేష్, తోటకూర చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శి అన్నా రాము, ఎస్.జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

నేడు నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు



అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న నందన

మసీదు సెంటర్(కాకినాడ): ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి టి.నందన మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల రోజున అభ్యర్థులు, ఓటర్లు పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించామన్నారు. అధ్యక్ష పదవి, ఉపాధ్యక్ష కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నిక జరగనుందన్నారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీజీహెచ్‌లోని రేడియాలజీ సెమినార్ హాలులో జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి తప్పనిసరిగా గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి వెంటనే ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

చక్రాల బూట్లు.. భవితకు బాటలు

న్యూస్‌టుడే, మసీదు సెంటర్(కాకినాడ)



రోడ్డు, రింక్.. ప్లాట్‌ఫాం ఏదైనా కాళ్లకు స్కేటింగ్ చక్రాలు కట్టుకుని రయ్‌మంటూ దూసుకుపోతూ పతకాల పంట పండిస్తున్నారు నగరానికి చెందిన బాలబాలికలు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు కాకినాడ రాజా ట్యాంక్ వద్ద ఉన్న ఇండోర్ స్టేడియంలో పాఠశాల విద్యాశాఖ క్రీడా సమాఖ్య(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ అంతర్ జిల్లాల అండర్-14, 17 రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభచాటి నవంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వివిధ జిల్లాల నుంచి వచ్చి ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పలువురు క్రీడాకారులు పలువురు 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు.

రెండు బంగారు పతకాలు సాధించా..



నేను ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాన్న సత్తిబాబు చిరు వ్యాపారి. అమ్మ లక్ష్మి గృహిణి. అమ్మనాన్నలిద్దరూ నన్ను ఉదయం, సాయంత్రం స్కేటింగ్ రింక్‌కు సాధనకోసం తీసుకువెళ్తారు. వారి ప్రోత్సాహంతో కాకినాడలో స్కేటింగ్ సాధన చేస్తున్నా. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో రింక్-4, రోడ్డు-2 విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. అంతర్జాతీయ పతకమే నా లక్ష్యం.

- ఎ.మహీధర్ రాజ్‌కుమార్, క్రీడాకారుడు, కాకినాడ

కోచ్ ప్రోత్సాహంతో..



ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నా. పదో తరగతిలో 516 మార్కులు సాధించా. నాన్న శంకర్ వ్యాపారి. అమ్మ లావణ్య గృహిణి. ఆరేళ్ల నుంచి కోచ్ ఈశ్వర్‌కుమార్ ప్రోత్సాహంతో స్కేటింగ్ నేర్చుకుని పతకాలు సాధిస్తున్నా. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రోడ్డు, రింక్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తా. సాధనకు రాత్రి పూట ఎక్కువ సమయం కేటాయిస్తా.

- వీర వర్షిణి, క్రీడాకారిణి

మూడు సార్లు జాతీయ స్థాయిలో మెరిశా..



నేను అయిదో తరగతి చదువుతున్నా. 90 శాతంపైగా మార్కులు సాధిస్తున్నా. నాన్న రాఘవేంద్రసుబ్బారెడ్డి ప్రైవేట్ ఉద్యోగి. అమ్మ శ్రీలక్ష్మి గృహిణి. ఏడేళ్ల నుంచి స్కేటింగ్ నేర్చుకుంటున్నా. ఇప్పటివరకు అయిదు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనగా మూడు సార్లు పతకాలు కైవసం చేసుకున్నా. ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్-11 ఇన్‌లైన్ విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించా. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. అంతర్జాతీయ పతకమే నా లక్ష్యం. రోజుకు ఆరు గంటలు సాధన చేస్తున్నా.

- శ్యామ్‌సుందర్‌రెడ్డి, క్రీడాకారుడు

రాణిస్తే ఉజ్వల ఉన్నతి



పాఠశాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర, జాతీయ స్థాయి స్కేటింగ్ టోర్నమెంట్లలో పతకాలు సాధించిన క్రీడాకారులకు చదువుతోపాటు ఉద్యోగాల్లోనైతం క్రీడా కోటా లభిస్తుంది. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది.

- లంకా జార్జి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి

సలహా కమిటీ సభ్యుడిగా రవి



కరప, న్యూస్‌టుడే: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా కరప మండలం గురజనాపల్లికి చెందిన గట్టి వెంకటేశ్వరరావు(రవి) నామినేట్ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ సెక్షన్ అధికారి దినేష్ చంద్ర(రాజమహేంద్రవరం) మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, కాకినాడ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్, వెల్డర్, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్ ట్రేడ్లలో అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఐటీఐ పూర్తిచేసిన ఆసక్తిగల అభ్యర్థులు www.apprenticeship-india.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు నవంబరు 8న ఉదయం 10 గంటలకు విజయనగరంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 08922-294906 నంబరులో సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన పట్టుగూళ్ల దిగుబడికి చర్యలు



మల్బరీ ఆకులను పరిశీలిస్తున్న అధికారిణి గీతారాణి

గొల్లప్రోలు: నాణ్యమైన పట్టుగూళ్ల దిగుబడి సాధించేలా చర్యలు చేపడుతున్నట్లు పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారిణి గీతారాణి తెలిపారు. మంగళవారం చేబ్రోలులోని పట్టు పరిశ్రమ కేంద్రం కార్యాలయంలో దస్త్రాలు తనిఖీ చేశారు. చాకీ కేంద్రాలు, పట్టు పురుగులు పెంచే షెడ్లను పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రామ్‌నగర్ నుంచి వచ్చిన గుడ్లతో తయారైన పట్టు పురుగులు గూళ్లు కట్టలేదని రైతుల నుంచి ఫిర్యాదులు అందినట్లు శాస్త్రవేత్తలకు తెలియజేశామన్నారు. మైసూర్‌నుంచి మొదటి విడతగా 6,600 గుడ్లు తెప్పిస్తున్నామన్నారు. 55 మంది రైతులకు సస్యరక్షణకు నిధులు ఇస్తున్నామన్నారు. యంత్రపరికరాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్రం అధికారి మోసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిహోత్రి ఆలయ శంకుస్థాపనకు చంద్రబాబుకు ఆహ్వానం



సీఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్న నెహ్రూ, శృంగేరీ ప్రతినిధులు

గండేపల్లి: గండేపల్లి మండలం నాయకంపల్లిలో జరిగే అగ్నిహోత్రి ఆలయ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆహ్వానించారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసిన జ్యోతుల నెహ్రూ ఈ నెల 26న శృంగేరి పీఠాధిపతులు ఆధ్వర్యంలో నాయకంపల్లిలో జరిగే ఈ కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యేతో పాటుగా ఆంధ్ర, తెలంగాణ శృంగేరి పీఠాధిపతుల ప్రతినిధి బంగారయ్య శర్మ, ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. అనంతరం గోకవరం ఆటోయూనియన్ సభ్యులు అందించిన రూ.88 వేల చెక్కును నెహ్రూ చంద్రబాబునాయుడుకి అందజేశారు. అనంతరం జై ద్వారకా ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ జిల్లా జట్ల ఎంపికలు



టెన్నిస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ డీఎస్ఏ మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు అండర్-14, 17, 19 బాల బాలికల టెన్నిస్ జిల్లా జట్ల ఎంపికలు మంగళవారం చేపట్టామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. ఎంపిక పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. అండర్-14 బాలికల జట్టుకు లోచన (సామర్లకోట), మానవిదేవి (కాకినాడ), తేజశ్రీ, ధరణి (రాజమహేంద్రవరం), బి.తేజశ్రీ (కాకినాడ), బాలుర జట్టుకు ప్రతీక్, నిఖిలేష్, నాగచరణ్ (కాకినాడ), ఇషాన్, జోషి (రాజమహేంద్రవరం) ఎంపికయ్యారు. అండర్-17 బాలికల జట్టుకు కాకినాడకి చెందిన శేషసాయి, జైనయన్, ఆశ్రిత, అన్విత, ఎల్.వి.మనస్వి, బాలుర జట్టుకు కృష్ణసాహిత్, కౌశిక్, నేత్ర, ఎస్.జైన్ (కాకినాడ), ఫైజల్ (రాజమహేంద్రవరం), అండర్-19 బాలికల జట్టుకు మైత్రీ లేఖన, అభిజ్ఞ (కాకినాడ), కె.దేవి (పిఠాపురం), పుష్పలత, వీరశ్రావణి (చొల్లంగి), బాలుర జట్టుకు కాకినాడకి చెందిన నీరజ్, సాకేత్, తనిష్క్, ఏకే కుమార్, ప్రణవవ్ కృష్ణ జిల్లా జట్లకు ఎంపికయ్యారు. వీరంతా త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి టి.రామ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శులు జి.సునీల్‌కుమార్, కె.పరశురాం, పీడీలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్, ఈ-కేవైసీ ఉంటేనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్, జేసీ

గండేపల్లి, న్యూస్‌టుడే: ప్రతి రైతు ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకుంటునే కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం తీసుకుంటారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఛైర్మన్ తోట సుధీర్ అన్నారు. గండేపల్లి మండలం మురారి గ్రామంలో మంగళవారం కాకినాడ జిల్లాలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఛైర్మన్, జేసీలు ప్రారంభించారు. సుధీర్ మాట్లాడుతూ.. జిల్లాలో 414 రైతు సహాయక కేంద్రాలు (ఆర్ఎస్‌కే)లు ఉన్నాయని, వీటిలో రైతు తమ ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవచ్చన్నారు. ఈ కేంద్రాలకు సంబంధించి ప్రతీ మండలానికి తహసీల్దారు ఛైర్మన్‌గా, మిల్లర్లతో కూడిన కమిటీ ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ.. కేంద్రానికి ధాన్యం ఇచ్చిన 48 గంటల్లో రైతు ఖాతాలో నగదు జమ అవుతుందని, ధాన్యంను కళ్లాల నుంచి కొనుగోలు కేంద్రాలకు చేరవేసేందుకు మిల్లర్లకు సంబంధించిన వెయ్యి వాహనాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. క్వింటాకు రూ.2300, 75 కేజీలకు రూ.1725 ప్రభుత్వ మద్దతు ధర రైతులకు అందిస్తున్నామన్నారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్లు కడలి ఈశ్వరీ, తుమ్మల పద్మజ, బొడపాటి శివదత్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి



సదస్సులో మాట్లాడుతున్న నవీన్, పాల్గొన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు

గండేపల్లి (జగ్గంపేట): పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేరాబత్తుల రాజశేఖర్, చిరంజీవి రాజును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం జగ్గంపేట తెదేపా కార్యాలయంలో ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ.. తెదేపాలో జడ్పీటీసీ సభ్యుడిగా, ఎంపీపీగా పనిచేశానని, పార్టీలో విధేయుడిగా ఉన్న నన్ను గెలిపించాలని కోరారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవి రాజు మాట్లాడుతూ.. శాసనమండలిలో కూటమి బలం పెంచుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, భాజపా ఇన్‌ఛార్జి దాట్ల కృష్ణవర్మ, తెదేపా నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, తోట రవి, తోట గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

అయిదో విడత ఐటీఐల్లో ప్రవేశాలకు అవకాశం

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ ఐటీఐలు, కాకినాడ, జగ్గంపేట, ప్రైవేటు ఐటీఐలలో 2024-25 సంవత్సరంలో ప్రవేశాల కోసం అయిదో విడత నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెండు జిల్లాల కన్వీనర్ ఎం.వి.జి.వర్మ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో iti.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్లను తప్పనిసరిగా రెండు జిల్లాల్లో తమకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలని సూచించారు. వీరికి ప్రవేశాలు కల్పించేందుకు ప్రభుత్వ ఐటీఐలలో 28వ తేదీన, ప్రైవేట్ ఐటీఐలలో 30వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సూచిక.. ప్రమాదమే ఇక!



అమినాబాదు శివారు బీచ్‌రోడ్డులో గుంతలో పెట్టిన కొబ్బరి దుంగలు

ఉప్పాడ నుంచి కోనపాపపేట వెళ్లే బీచ్ రోడ్డులో అమినాబాదు శివారులో కల్వర్టుపై గుంత ఏర్పడింది. దీన్ని గుర్తించడానికి అక్కడ మూడు కొబ్బరి దుంగలను హెచ్చరిక సూచికగా నిలబెట్టారు. రహదారి మధ్యలో ఉండటంతో వీటి వల్ల ప్రమాదం జరిగే అవకాశముంది. వాహన చోదకులు పగటి వేళ వీటిని గుర్తించినా.. రాత్రి సమయంలో ఇవి కనిపించక ఢీకొట్టి పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. వాటిని తొలగించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కొత్తపల్లి

క్షేత్ర సహాయకురాలి ఆత్మహత్యాయత్నం



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ సునీత

కరప: గ్రామంలో నాయకుల వేధింపులు తాళలేక కరప మండలం పెనుగుదురుకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పులపకూర సునీత మంగళవారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేశారు. ప్రస్తుతం ఆమె కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమె భర్త వీరబాబు మాట్లాడుతూ గ్రామానికి చెందిన జనసేన నాయకులు కొన్నాళ్లుగా వేధిస్తున్నారన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నావని, ఏవేవో పేర్లతో మస్తర్లు వేసి ఆ సొమ్ము తమకు ఇవ్వాలని, లేకుంటే విధుల నుంచి తొలగింపజేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. దాంతో మనస్తాపం చెందిన సునీత మంగళవారం ఉదయం విష రసాయనంలో నిద్రమాత్రలు కలిపి తాగి ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఘటన నేపథ్యంలో గ్రామానికి చెందిన జనసేన నాయకులు బండారు మురళి, గంటా నాని మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ సునీత రోజువారీ మస్తర్లలో పనిలోకి రానివారి పేర్లు రాసి సొమ్ము తీసుకుంటూ అవకతవకలకు పాల్పడుతున్నారని, ఇంట్లో కూర్చుని మస్తర్లు రాస్తున్నారని, సంతకాలు, వేలిముద్రలు కూడా ఆమే వేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఈ నెల 5న డ్వామా పీడీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. దీని గురించి డ్వామా పీడీ వెంకటలక్ష్మిని అడుగగా ఫిర్యాదులపై ఈ నెల 25న విచారణ నిర్వహిస్తామన్నారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదూ తమకు అందలేదని ఎస్సై టి.సునీత తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు (కిలోకు)

గాంధీనగర్: టమాటా - 38, వంకాయలు - 50, 66, బెండకాయలు - 46, పచ్చిమిర్చి - 50, 54, కాకరకాయ - 36, బీర - 45, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 44, క్యారెట్ - 42, దొండకాయలు - 30, బంగాళా దుంపలు - 30, 36, ఉల్లి - 45, 50, గోరుచిక్కుళ్లు - 32, దోసకాయలు - 40, ఆనబకాయ - 30, 35, పొట్లకాయ - 20, 25, అరటికాయ - 5, 6, చిక్కుళ్లు - 120, చేమదుంపలు - 30, 40, మునగకాడలు - 5, 6, బీట్‌రూట్ - 40, కీరదోస - 26, బీన్స్‌గింజలు - 130, అల్లం - 60, క్యాప్సికం - 100, బొబ్బర్లు - 54, చిలగడదుంపలు - 32, మామిడికాయ - 8, 12, నిమ్మకాయలు (డజన్) - 24, 54.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్ - విశ్వం, వేట్టయన్ ది హంటర్, విశ్వం, ఇద్దరు, జనక అయితే గనక, సత్య సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్ - ది డీల్, విశ్వం, జిగ్రా, లక్కీ - ఇద్దరు, సత్యగౌరి - లవ్‌రెడ్డి, తిరుమల - వేట్టయన్ ది హంటర్, సీఅండ్‌సీ 1 - జనక అయితే గనక, సీఅండ్‌సీ 2 - స్వాగ్, శ్రీప్రియ - మార్టిన్, పద్మప్రియ - దేవర పార్ట్ 1, సూర్య 1 (వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2 - వేట్టయన్ ది హంటర్ (మ, రా) విశ్వం (ఉ, సా), శ్రీశ్రీనివాసా (వేళంగి) - సలార్ (మ, సా), ఈశ్వర్ (ఉ, రా).

మేమున్నాం.. మీకు తోడుగా

వీధి దీపం వెలిగింది..

స్పందనకు వందనం



గొడారిగుంట రాధానగర్‌లో వీధిదీపం కొన్ని రోజులుగా వెలగడం లేదని, చీకటిలో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని స్థానికుడు సత్యనారాయణ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యను నగరపాలక సంస్థ ఏఈ సాంబశివరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించారు. సిబ్బందితో వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించారు.



చెత్త తరలించడం లేదు..

సమస్య: గాంధీనగర్ బాలభవన్ నెహ్రూ కేంద్రం వద్ద పాత సామాన్లు, వ్యర్థాలు పడేశారు. అక్కడే స్థానికులు కూడా చెత్తను వేస్తున్నారు. చాలా రోజుల నుంచి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయడం లేదు. **- స్థానికులు, గాంధీనగర్**

సమాధానం: సిబ్బందిని పంపించి వెంటనే చెత్తను తరలించేలా చర్యలు తీసుకుంటాం. **- శానిటరీ ఇన్‌స్పెక్టర్, నగరపాలకసంస్థ**

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు:

సాంబమూర్తినగర్: 91548 46719

హుష్ ఆంధ్రా..!

గత వైకాపా ప్రభుత్వ తీరుతో ఫిష్ మార్కెట్ డీలా

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: తలసరి మత్స్య వినియోగాన్ని పెంచాలనే ఉద్దేశంతో గత వైకాపా ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా పేరుతో ప్రత్యేకంగా దుకాణాలను తెరిచి కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఉద్దేశం మంచిదే అయినప్పటికీ ఆచరణలో వైఫల్యాలు తలెత్తడంతో నిర్వహణ నీరుగారింది. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించడం, చేపల వ్యాపారంతో సంబంధం లేనివారికి సైతం రుణాలు మంజూరు చేయడం, సిఫార్సులకు పెద్దపీట వేయడం తదితర కారణాలతో ఎదురైన వైఫల్యాలు పథకాన్ని దెబ్బతీశాయి.

ఫిష్ ఆంధ్రా పథకంలో భాగంగా కాకినాడ నగర పరిధిలోనే 20 వరకు దుకాణాలు మంజూరయ్యాయి. వీటిలో ఒకటి రెండు మినహా మిగతావన్నీ మూతపడ్డాయి. నడిచే ఆ ఒకటి రెండులో కూడా కొన్ని దుకాణాల్లో చేపల విక్రయాలకు బదులుగా ఆహార పదార్థాలు, బిర్యానీ, ఇతర వ్యాపారాలు సాగించడం గమనార్హం. ఫిష్ ఆంధ్రా పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, మిగతా వారికి 40 శాతం రాయితీతో రుణాలు అందించారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో పథకాన్ని అమలుచేసినా లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం మితిమీరింది. ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల సిఫార్సులు ఉన్నవారికే రుణాలు అందించి దుకాణాలు కేటాయించినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఈ కారణంగా దుకాణాలను హడావుడిగా ఏర్పాటుచేశారే తప్ప ఎక్కడా విజయవంతంగా నడుస్తున్న దాఖలాలు లేవు. ఫలితంగా ప్రభుత్వ ఉద్దేశం నీరుగారింది. రాయితీ రూపంలో మంజూరు చేసిన నిధులు అక్కరకు రాకుండాపోయాయి.



దుమ్ములపేట బైపాస్‌రోడ్డులో తెరచుకోని దుకాణం



రామారావుపేటలో మూతపడ్డ ఫిష్ ఆంధ్రా స్టాల్

నగరంలో ఎక్కడెక్కడంటే..

- దుమ్ములపేట బైపాస్‌రోడ్డులో ఏర్పాటుచేసిన ఫిష్ ఆంధ్రా దుకాణం ఇప్పటికీ తెరుచుకోలేదు.
- సంతచెరువులోని గుడి వద్ద ప్రారంభించిన స్టాల్ కొద్దిరోజులు బాగానే నడిచినా ఆ తర్వాత మూతపడింది.
- రామారావుపేటలోని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన దుకాణం తలుపులు ఇప్పటివరకు తెరవలేదు.
- జగన్నాథపురం ఎంఎస్ఎన్ ఛారిటీస్ వద్ద ఏర్పాటుచేసిన దుకాణానిదీ అదే తీరు.
- డెయిరీఫారం సెంటర్ వాటర్‌ట్యాంకు వద్ద ఏర్పాటుచేసిన ఫిష్ ఆంధ్రాకు కేటాయించిన దుకాణంలో సగ భాగాన్ని టీ దుకాణంగా మార్చేశారు. అలాగే చేపల దుకాణంలో వాటికి బదులుగా ఐస్‌క్రీమ్‌లు విక్రయిస్తున్నారు.

సక్రమంగా నడిచేలా చర్యలు..

ఫిష్ ఆంధ్రా పథకం కింద మంజూరుచేసిన అన్ని దుకాణాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. మూతపడిన దుకాణాలను తిరిగి తెరిపిస్తాం. తలసరి మత్స్య వినియోగాన్ని పెంచేలా గతంలో ప్రణాళిక రూపొందించారు. తద్వారా మత్స్యకారుల జీవనోపాధిని పెంపొందించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

- కరుణాకరరావు, మత్స్య శాఖ జిల్లా అధికారి

అమరవీరుల కుటుంబసభ్యులకు పరామర్శ



అమరవీరుల కుటుంబసభ్యులతో పోర్టు సీఐ సునీల్‌కుమార్ తదితరులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోర్టు పోలీసు స్టేషన్ పరిధిలోని వారి కుటుంబసభ్యుల ఇళ్లను సీఐ పి.సునీల్‌కుమార్ మంగళవారం సందర్శించి పరామర్శించారు. గంటిమిల్లి సత్యనారాయణ భార్య పాప, కుమార్తె లావణ్య, కుమారులు గంగాధర్, జగన్‌కృష్ణ, కోటిపాటి వీరగంగరాజు, భార్య వెంకటరామలక్ష్మి, కుమార్తెలు వనితాదేవి, జయశ్రీ, దేవరాజు, భార్య దొంతమ్మ, కుమార్తె వీరలక్ష్మి, కుమారుడు రాంబాబు తదితరులను సీఐ పరామర్శించారు. వారి యోగక్షేమాలు తెలుసుకుని పండ్లు అందించారు. ప్రభుత్వం తరఫున సాయం అందిస్తామని భరోసా కల్పించారు.

రాష్ట్ర పిస్టల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ



మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఈనెల 20న సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ 68వ అంతర్ జిల్లాల పిస్టల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాకినాడకి చెందిన సూర్యప్రణవ్ ప్రతిభ కనబరిచాడు. అండర్-17 విభాగంలో ప్రథమస్థానంలో నిలిచాడు. బంగారు పతకం సాధించి వచ్చే డిసెంబర్‌లో భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. 9వ తరగతి చదువుతున్న ప్రణవ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కోచ్‌తో పాటు క్రీడాకారులు తదితరులు అభినందించారు.

ట్రెజర్‌హంట్ గోడపత్రికల ఆవిష్కరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రాణాంతక వ్యాధిగ్రస్త చిన్నారులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో ఈనెల 27న కాకినాడ లయన్స్ క్లబ్ సంకల్ప్ ఆధ్వర్యంలో నిర్వహించే ట్రెజర్‌హంట్ కార్యక్రమ గోడపత్రికలను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరించారు. చిన్నారుల ఆయుష్షు, ఆరోగ్యాన్ని పెంచడానికి అవసరమైన నిధుల సేకరణకు క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎస్.లావణ్య, స్వాతి, అనిత, మోనికా, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

నేడు కమిషనర్ భావన రాక

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కమిషనర్ భావన బుధవారం నగరానికి రానున్నారు. ఈనెల 21, 22 తేదీల్లో దిల్లీలో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆమె హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న అర్బన్ రీసర్వే (భూములు, ఆస్తుల)కు సంబంధించి రాష్ట్రంలో ఒక పురపాలక సంఘం, ఏడు నగరపాలక సంస్థలను ఎంపికచేయగా కాకినాడ కార్పొరేషన్ తరఫున ఆమె హాజరయ్యారు. నక్షా పేరుతో భూముల రీసర్వే జరుగనుంది.





వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ దివాకర్

ప్రతిభలో మేటి.. విజేతలుగా నిలిచి..

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ప్రతిభాపాటవ పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లోని మేధస్సు వికసిస్తుందని కాకినాడ భాష్యం పాఠశాలల జోనల్ ఇన్‌ఛార్జి గోవిందరాజు అన్నారు. స్థానిక విద్యుత్తునగర్‌లోని భాష్యం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించగా 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని ప్రతిభచాటారు. గుల్లపల్లి నిఖిలేంద్ర (9వ తరగతి) ప్రథమ బహుమతి, కామిరెడ్డి హస్మిత (10వ తరగతి) ద్వితీయ బహుమతి, సింగిరెడ్డి సాయిశివ లక్ష్మి (8వ తరగతి) తృతీయ బహుమతికి ఎంపికయ్యారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. క్యాంపస్ ప్రిన్సిపల్ స్వర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.9,00,786



బాలాత్రిపురసుందరి ఆలయంలో నగదు లెక్కిస్తున్న భక్తులు, అధికారులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని సూర్యారావుపేట శ్రీబాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీలను మంగళవారం తెరిచారు. దేవాదాయ శాఖ కాకినాడ డివిజన్ తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు సమక్షంలో ఆదాయం లెక్కించారు. దసరా పండగ నేపథ్యంలో ఈసారి రూ.9,00,786 ఆదాయం సమకూరిందని ఈవో తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం, గ్రంధి బాబ్జి, రామారావుపేట శివాలయం ఈవో బి.శ్రీరామచంద్రమూర్తి, యూనియన్ బ్యాంకు సూర్యారావుపేట శాఖ సిబ్బంది, పోలీస్, రెవెన్యూ సిబ్బందితో పాటు నేమాని సత్యనారాయణ, నల్లూరి తులసి, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శ్రీనగర్‌లోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులు - గౌరవం అనే అంశంపై వయోవృద్ధుల సంక్షేమ శాఖ సమక్షంలో విద్యార్థినులకు అసోసియేషన్ అధ్యక్షుడు బి.సూర్యనారాయణమూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తటవర్తి అనూరాధ, వి.రామసుబ్బారావు, ఎస్‌వీప్రసాద్, యు.రాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకానికి 2,123 మంది గుర్తింపు

త్వరలో సామగ్రి రుణాల పంపిణీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం చేతివృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో 2,123 మందిని ప్రాథమికంగా ఎంపికచేసి సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 2023 ఆగస్టు నుంచి 2024 ఆగస్టు వరకు నగరపాలక సంస్థ పరిధిలో చేతివృత్తిదారుల నుంచి ఈ పథకానికి దరఖాస్తులు స్వీకరించారు. చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు మాత్రమే పథకాన్ని వర్తింపజేయనున్నారు. నగర పరిధిలో 2,743 దరఖాస్తులు రాగా మొదటి విడత సర్వేలో 2,123 మందికి అర్హత ఉన్నట్లు లెక్కతేల్చారు. తాజాగా రెండో విడత సర్వే చేపట్టారు. నగరపాలక సంస్థకు చెందిన నోడల్ అధికారులు, సచివాలయం సంక్షేమ కార్యదర్శులు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ల ఆధ్వర్యంలో సర్వే జరుగుతోంది. ఇది పూర్తయిన తరవాత కలెక్టర్‌కు వివరాలు నివేదించి లబ్ధిదారుల తుది జాబితాకు ఆమోదం తీసుకుంటారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో రెండో విడత సర్వే ప్రక్రియ ప్రారంభించారు. వీలైనంత త్వరగా పూర్తిచేసి కమిషనర్ భావన ఆధ్వర్యంలో కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని టౌన్ ప్రాజెక్టు అధికారి కె.శైలజ చెప్పారు. అర్హులంతా ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



సర్వేచేస్తున్న నోడల్ అధికారులు, సిబ్బంది

ఇదీ ప్రయోజనం..

పీఎం విశ్వకర్మ యోజనకు ఎంపికైన లబ్ధిదారులకు రూ.15 వేల విలువైన చేతివృత్తి పరికరాలను ఉచితంగా అందిస్తారు. 5 శాతం వడ్డీకి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున బ్యాంకు రుణాలు కల్పిస్తారు. లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ ఇస్తారు. అత్యాధునిక సాంకేతిక అంశాలపై విభాగాల వారీగా నైపుణ్య శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ ప్రణాళికను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సిద్ధం చేస్తున్నారు. ఈ పథకానికి 18 రకాల చేతివృత్తులవారిని ఎంపికచేయాలని అర్హులను గుర్తించారు. వీరిలో స్వర్ణకారులు, వడ్రంగులు, తాపీపనివారు, శిల్పకారులు, వలలు, బోట్లు తయారీ, చెప్పులు తయారీ, కుండలు, బుట్టలు అల్లికలు, కలంకారీ బొమ్మలు తయారీ, దోబీలు, క్షురకులు, దర్జీలు తదితర విభాగాల వారు ఉన్నారు.

గుంతల దారిలో భయం..

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: పేరుకే ఆకర్షణీయ నగరం.. తీరు అధ్వానం.. అన్నట్లుగా కాకినాడలో రోడ్ల తీరు మారింది. పలు రహదారులు గుంతలతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల ధ్వంసమై ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై నిర్లక్ష్యం వహించడం, చిన్న గుంతలను సైతం పూడ్చకుండా వదిలేయడంతో ప్రస్తుతం రహదారులు దారుణంగా తయారయ్యాయి. వీటిపై వాహనదారులు ఇబ్బందులకు గురవడమే కాకుండా నిత్యం ప్రమాదాలతో గాయపడతున్నారు. కాకినాడ దుమ్ములపేట, మున్సిబు కూడలి నుంచి ఘాటీసెంటర్ మధ్యలో పలుచోట్ల, శాంతినగర్, శ్రీనగర్, భానుగుడి వంతెన దిగువ, భాస్కర్‌నగర్, జగన్నాథపురంతో పాటు పలు వంతెనలపై గుంతలు ఏర్పడ్డాయి. వీటికి మరమ్మతులు సైతం చేయకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.



శాంతినగర్ ప్రధాన రహదారిపై గుంతలు



వెంకట్‌నగర్ ప్రధాన రహదారి అధ్వానంగా ఇలా..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

1 నుంచి 5 వరకు రౌండ్‌టేబుల్ సమావేశాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: మహిళలపై అత్యాచారాలు, వివక్షత, దాడులకు వ్యతిరేకంగా పోరాడుదాం నినాదంతో ప్రగతి నారి సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 5వ తేది వరకు రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. సంఘం ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పాతబస్టాండ్ వద్ద కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు బి.పద్మ, కార్యదర్శి వి.మంగాదేవి మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై అత్యాచారాలు, వివక్ష, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పటిష్టమైన చట్టాలు, అమలుతో నియంత్రించాలని కోరారు. దాడులకు వ్యతిరేకంగా మహిళలను చైతన్యపర్చేలా నవంబర్ 1 నుంచి 5 వరకూ రాష్ట్రవ్యాప్తంగా జరిగే రౌండ్‌టేబుల్ సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం కాకినాడ నగర కార్యదర్శి పి.వరలక్ష్మి, కమిటీ సభ్యులు పి.వెంకటలక్ష్మి, విజయగౌరి, రాష్ట్ర ఇన్‌ఛార్జి ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: విద్యార్థినులకు ప్రత్యేకంగా కళాశాలలో ఆధార్ సేవా కేంద్రం ప్రత్యేక శిబిరం మంగళవారం ఏర్పాటుచేసినట్లు అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ఎన్ మూర్తిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరం ఈనెల 26 వరకు కొనసాగుతుందన్నారు. యూఐడీఏఐ (ఆధార్ సేవా కేంద్రం) జిల్లా మేనేజర్ కెప్టెన్ కె.శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఆధార్‌లో పేరు, ఫొటో, చిరునామా, వేలిముద్రలు, ఫోన్ నంబరు నమోదు తదితర పనులన్నీ కళాశాలలోనే చేస్తామన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న స్వామి సేవియానంద

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: సమస్యలు ఎదురైతే ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటూ ముందుకు సాగాలని కాకినాడ భాష్యం పాఠశాలల జోనల్ ఇన్‌ఛార్జి గోవిందరాజు సూచించారు. శాంతినగర్‌లోని ఆ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం స్వామి సేవియానంద ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సమాజంలో ఎలా నడవాలి, ఎలా మాట్లాడాలి, ఎలా ప్రవర్తించాలనే అంశాలతో పాటు సంప్రదాయాలను వివరించారు. సాత్విక, పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. యోగా సాధనతో పాటు స్వామి వివేకానంద పుస్తకాలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రాజశేఖర్, శ్రీనివాస్, కల్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీలకు అన్యాక్రాంత భూములు అప్పగించాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: తాళ్లరేవు మండలం కోరంగి గ్రామంలోని వివిధ సర్వే నంబర్లలో ఉన్న 69.60 ఎకరాల అన్యాక్రాంత భూమిని ఎస్సీలకు అప్పగించాలని అఖిలభారత ఫార్వర్డ్ పార్టీ (ఏఎఫ్‌బీఐ) రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీలకు చెందిన ఈ భూమి కొన్నేళ్ల కిందట అన్యాక్రాంతమైందన్నారు. చట్ట ప్రకారం భూమిని తిరిగి పట్టదారులకు లేదా వారసులకు అప్పగించాల్సి ఉంటుందన్నారు. దీనిపై లోకాయక్త 2022 ఆగస్టు 11న అనుకూలంగా ఉత్తర్వులిచ్చిందని ఆయన గుర్తుచేశారు. తహసీల్దారు అసైన్డ్ భూముల చట్టం ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు.

జిల్లా టెలికం సలహా కమిటీ సభ్యుల నియామకం



సత్యనారాయణ



వరప్రసాద్

గాంధీనగర్, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ పూర్వ అధికారి, లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఆర్.వి.సత్యనారాయణ తూర్పుగోదావరి జిల్లా టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి కృషి చేస్తానన్నారు.

కాకినాడ కలెక్టరేట్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యుడిగా ఎలుచూరి వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్ఎన్ఎల్ సీఎండీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 2026 జులై 13 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన పదవిలో కొనసాగుతారు. కాకినాడ గ్రామీణ మండలం వలసపాకల గ్రామానికి చెందిన వరప్రసాద్ 2014 నుంచి జనసేన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పదవి వచ్చిన సందర్భంగా ఆయన మంగళవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి ధన్యవాదములు తెలిపారు.

జిమ్నాస్టిక్స్‌లో హిమవర్షిణి ప్రతిభ



హిమవర్షిణిని అభినందిస్తున్న హరిప్రసాద్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: తాడేపల్లి స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయిలో సోమవారం జరిగిన జిమ్నాస్టిక్స్ పోటీల్లో కాకినాడలోని శ్రీచైతన్య ఐపీఎల్ క్యాంపస్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని పోతల హిమవర్షిణి మూడు రజిత పతకాలు సాధించింది. ఈసందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం హరిప్రసాద్, కళాశాలల డీన్ శ్రీనివాసు, ప్రిన్సిపల్ మోహన్‌కుమార్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. హిమవర్షిణికి అవసరమైన అన్ని వసతులు సమకూర్చడానికి సహకరిస్తామని, వనరులు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు వినోద్, మోహన్‌కుమార్, పీడీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

జిల్లా టెలికాం సలహా కమిటీ సభ్యుల నియామకం


సత్యనారాయణ


వరప్రసాద్

కాకినాడ కలెక్టరేట్, గాంధీనగర్, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెలికాం సలహా కమిటీ సభ్యులుగా బీఎస్ఎన్ఎల్ పూర్వ అధికారి, లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఆర్.వి.సత్యనారాయణ, ఏలూరి వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్ఎన్ఎల్ సీఎండీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 2026 జులై 13 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వీరు పదవిలో కొనసాగుతారు.

గ్యాస్ ఏజెన్సీల తనిఖీ

పెద్దాపురం: త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వంట గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనుండటంతో మంగళవారం పెద్దాపురం పట్టణంలోని భారత్, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలను ఎంఎస్‌వో భారతి తనిఖీ చేశారు. సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పెద్దాపురం: దివిలి విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మర్లావ, తూర్పుపాకలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ప్రభాకర్ తెలిపారు.


మాట్లాడుతున్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పట్టభద్ర ఓటర్ల నమోదుకు కృషి

పెద్దాపురం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుపై కూటమి నాయకులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలోని సత్యనారాయణపురంలో కింజరాపు ఎర్రన్నాయుడు వెలమ సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో కూటమి నాయకులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి(బాబు) మాట్లాడుతూ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. జడ్పీ మాజీ ఛైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్, ఎన్నికల పరిశీలకులు రమణ, చిరంజీవి, రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి విత్తనాల వెంకటరమణ, నియోజకవర్గంలోని తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి నాయకుల మధ్య వాగ్వాదం

కూటమి పార్టీలు బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతు తెలుపుతూ ముద్రించిన కరపత్రంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి ఫొటో లేకపోవడంతో జనసేన కార్యకర్తలు సమావేశం బయట నాయకులను నిలదీశారు. కూటమి నాయకుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. జనసేన నాయకుడు రామస్వామి బయటకు వచ్చి జనసైనికులకు సర్దిచెప్పడంతో శాంతించారు.

స్కానింగ్ పరీక్షల్లేవు... అంబులెన్స్‌లు పనిచేయవు

న్యూస్‌టుడే – పెద్దాపురం, సామర్లకోట

పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దాపురం ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచుతూ గత తెదేపా ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తే.. వైకాపా ప్రభుత్వం మళ్లీ 50 పడకలకు తగ్గిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పెద్దాపురం నుంచి రాజానగరం మధ్య జరిగే రోడ్డు ప్రమాదాల కేసులు పెద్దాపురం ఆసుపత్రికి వస్తుంటాయి. సిటీ స్కానింగ్ లేకపోవడంతో తాత్కాలికంగా వైద్యసేవలు అందించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నారు.

పెద్దాపురం, సామర్లకోట ఆసుపత్రుల్లో రోగుల అవస్థలు

వంద పడకలను 50కు తగ్గించి...

పెద్దాపురం పట్టణంలో కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రి ఉంది. 2016 ప్రాంతంలో అప్పటి తెదేపా హయాంలో సుమారు రూ. 7 కోట్లతో అధునాతన భవనం నిర్మించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న 50 పడకలు సరిపోవడంలేదు. రోజూ పెద్దాపురం చుట్టుపక్కల మండలాల నుంచి సుమారు 400 నుంచి 450 మంది రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. ప్రత్యేక వైద్య నిపుణులు, సిబ్బంది ఉన్నారు. మందుల కొరత లేదు. గర్భిణులకు సంబంధించిన స్కానింగ్ యంత్రం మాత్రమే ఉంది. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రుల పరీక్షలకు సీటీ స్కానింగ్ లేదు. పోస్టుమార్టం గదిలో మృతదేహాలను భద్రపర్చే ఫ్రీజర్ మరమ్మతులతో మూలకు చేరింది. మృతుల బంధువులు ప్రైవేటు ఫ్రీజర్లను అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఆర్‌టీవీ అంబులెన్స్, జాతీయ గ్రామీణ మిషన్ అంబులెన్స్ మరమ్మతుల్లో ఉన్నాయి. ప్రైవేటు అంబులెన్స్‌లే దిక్కవుతున్నాయి.


సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రం ఓపీ వద్ద..

సామర్లకోటలో 33 పడకలు...

సామర్లకోట పట్టణంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఉండగా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నూతన భవనం నిర్మించారు. ఇక్కడ 33 పడకలు ఉన్నాయి. అవసరమైనంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నారు. మందుల కొరత లేదు. ఎక్స్‌రే, సీటీ స్కానింగ్ సదుపాయం లేదు. గర్భిణులను పరీక్షించే స్కానింగ్ యంత్రం మాత్రమే ఉంది. రోజూ సామర్లకోట చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 200 నుంచి 250 మంది అవుట్ పేషెంట్లు వస్తుంటారు. వైద్య సేవలు పొందాలంటే విధిగా ఓపీ వద్ద ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డుతో పేరు నమోదు చేయించుకోవాలి. ఇక్కడ డేటా ఆపరేటర్ల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్ సౌకర్యం లేదు. ప్రజలు 108, ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. సీటీ స్కానింగ్, తదితర అత్యవసర వైద్య సేవలకు రోగులను కాకినాడ తరలిస్తుండటంతో ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిపై ఒత్తిడి పెరుగుతోంది.


పెద్దాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ వద్ద రోగులు

సదుపాయాల కల్పించాలని నివేదించాం...

ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలు అందిస్తున్నాం, మందుల కొరత లేదు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలతో వచ్చిన వారికి రక్త పరీక్షలు చేస్తున్నాం. అదనపు పడకలు, ఫ్రీజర్, అంబులెన్స్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు అవసరమని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

- సతీష్‌రెడ్డి, అమల, ఆసుపత్రి ప్రధాన వైద్యులు, పెద్దాపురం, సామర్లకోట

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో శ్రీనివాస్

పిఠాపురం: పాదగయ క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకార్యలు కల్పించడంపై దృష్టి సారిస్తానని ఈవో కాట్నం జగన్మోహన్‌శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఈవోగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు ఇన్‌ఛార్జి ఈవో, లోవ దేవస్థానం ఈవో విశ్వనాథరాజు దస్త్రాలు అప్పగించారు. రాబోయే కార్తిక మాసంలో ఆలయంలో చేయాల్సిన ఏర్పాట్లపై ఈవో శ్రీనివాస్ సిబ్బందితో చర్చించారు. సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం


పెద్దాపురప్పాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన చిక్కాల

కరప, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు తెలిపారు. పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం సర్పంచి బి.సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లెపండగ కార్యక్రమంలో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పి.ప్రభావతి, ఉప సర్పంచి శ్రీనివాస అప్పారావు, గొల్లపల్లి సోమశంకరరావు, బొండా చంటిబాబు పాల్గొన్నారు.

భూ రీసర్వే సమస్యలపై అర్జీల స్వీకరణ


చేబ్రోలు సభలో సిబ్బందికి సమస్యలు వివరిస్తున్న రైతులు

సామర్లకోట గ్రామీణం: ఉండూరులో తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన రీసర్వే గ్రామసభలో రైతుల నుంచి 17 అర్జీలు అందాయి. గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తమ భూమి విస్తీర్ణం తగ్గిపోయిందని, సమస్యను పరిష్కరించాలంటూ వినతులు అందజేశారు. పట్టాదారు పాసుపుస్తకంలో పేరు మార్పు కోసం 2, సవరణలు, తదితరాల కోసం 10 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కాజులూరు: తర్లంపూడి, టి.మామిడాడలోని గ్రామసభల్లో అయిదు అర్జీలు అందాయని తహసీల్దారు ఎల్.శివకుమార్ తెలిపారు.

కరప: సిరిపురంలో సర్పంచి నున్న సుజాత అధ్యక్షతన రీసర్వే గ్రామ సభ లో 61 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దారు ఎన్.సత్యనారాయణ తెలిపారు. డీటీ దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ రూపవతి, వీఆర్వో వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

గొల్లప్రోలు: పంట భూముల రీసర్వేలో తప్పిదాలను సరిచేయాలని కోరుతూ మంగళవారం లక్ష్మీపురం రెవెన్యూ గ్రామానికి సంబంధించి చేబ్రోలులోని రామాలయంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులకు 108 మంది రైతులు అర్జీలు అందజేశారు. డిప్యూటీ తహసీల్దారు ఎస్‌కే మస్తాని, మండల సర్వేయరు కేదారేశ్వరరావు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

గ్రామాలను దత్తత తీసుకోవాలి

తాళ్లరేవు: ప్రతి కళాశాల వారి పరిధిలోని గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని గ్రామీణాభివృద్ధి ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ పావని భీశెట్టి కోరారు. మంగళవారం పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర మానవ వనరులశాఖ, కేంద్ర విద్యాశాఖ సంయుక్తంగా ఉన్నత్ భారత్ అభియాన్ ఆంధ్ర విశ్వకళ పరిషత్తు ప్రాంతీయ సమన్వయకర్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్, వైస్ ప్రిన్సిపల్ రవి కుమార్, డీన్ డాక్టర్ వీరభద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రరెడ్డి, రీసెర్చ్ హెడ్ డాక్టర్ వంశీ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు ఇంటి పన్ను ఫిర్యాదుపై విచారణ

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఆస్తి లేకపోయినా తన పేరున ఇంటి పన్ను సృష్టించి 2021లో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయకుండా చేశారంటూ పంచాయతీరాజ్ కమిషనర్‌కు నాగులాపల్లికి చెందిన కూనిశెట్టి అచ్చామణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో అన్నామణి మంగళవారం విచారణ చేశారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అచ్చామణి నామినేషన్ వేశారు. పంచాయతీని ఏకగ్రీవం చేసుకునేందుకు అప్పటి పంచాయతీ కార్యదర్శి ద్వారా వైకాపా నాయకులు తప్పుడు ఇంటి పన్ను రసీదు సృష్టించి పోటీ చేయకుండా చేశారు. అచ్చామణి సోదరుడు, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు డీఎల్‌పీవో అన్నామణి నాగులాపల్లి గ్రామం చేరుకుని పన్నుకు సంబంధించిన ఇంటిని పరిశీలించారు. పంచాయతీ రికార్డుల్లో సుబ్బారావు పేరున ఉన్న ఆ ఇల్లు శిథిలావస్థలో ఉండగా, అందులో ఎవరూ నివసించడం లేదని గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆమె తెలిపారు.

గుంతలు పూడ్చిన తెదేపా నాయకులు

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్సేన్‌పురం నుంచి పెదబ్రహ్మదేవం వరకు ప్రమాదకరంగా ఉన్న గుంతలను తెదేపా రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనుబాబు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్ సొంత నిధులు రూ. 10 లక్షలు ఖర్చు చేసి పూడ్పించారు. 16 కిలోమీటర్ల మేర గుంతల్లో కంకర వేయించి యంత్రంతో చదును చేయించారు. నిత్యం అనేక మంది వాహన చోదకులు గుంతల్లో పడి గాయాలపాలయ్యేవారని, సొంత నిధులు వెచ్చించి సమస్య పరిష్కరించిన తెదేపా నాయకులను పలువురు అభినందించారు.


పి.బి.దేవంలో గుంతలను పూడ్పిస్తున్న శ్రీనివాస్

రోడ్డున జలం... కలుషితమయ్యే ప్రమాదం

న్యూస్‌టుడే – పెద్దాపురం, పిఠాపురం

పెద్దాపురం, పిఠాపురం పట్టణాల్లో పైపులైన్ల లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా రహదారులపై పారుతోంది. బురద నీరు లీకేజీల నుంచి సరఫరా చేసే నీటిలో చేరి కలుషితం అవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.


పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయం ఎదుట..

పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయం ఎదుట కొన్ని రోజులుగా లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. ఆ ప్రాంతం బురదమయమవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి లీకేజీని నియంత్రించాలని కోరుతున్నారు.

● పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో అంజనేయ స్వామి ఆలయ సమీపంలో తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడటంతో దాదాపు 15 రోజులుగా నీరు వృథాగా పోతోంది. కొళాయిల ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారి, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సరఫరా పర్యవేక్షణాధికారి జనార్దన్‌ను వివరణ కోరగా, తక్షణమే పైపులైన్ లీకేజీ పనులు చేపట్టి నీటి వృథాకు అడ్డుకట్ట వేస్తామని తెలిపారు.


జగ్గయ్య చెరువు వద్ద ఇలా..

'సూపర్ సిక్స్‌పై మాట్లాడే అర్హత వైకాపాకు లేదు'

పిఠాపురం, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ పథకాల గురించి మాట్లాడే అర్హత వైకాపాకు లేదని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ మండిపడ్డారు. పిఠాపురంలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విమర్శించడంపై అగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల ఎలా ప్రవర్తించాలో ఆయన చెప్పడం హాస్యాస్పదమన్నారు. నగ్న వీడియో కాల్ మాట్లాడుతూ మహిళా లోకాన్ని కించపరిచిన మాధవ్ నీతులు చెప్పడం సరికాదన్నారు. 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రారంభించిందని, త్వరలో దీపం పథకం కూడా అమలవుతోందన్నారు. అభివృద్ధిపై చంద్రబాబు దృష్టి సారించారని, దీన్ని వైకాపా తట్టుకోలేక విమర్శలు చేస్తోందన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


నాగలక్ష్మి (పాత చిత్రం)

పిఠాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఎదుట అద్దె ఇంట్లో నివసిస్తున్న వివాహిత అనసూరి నాగలక్ష్మి (28) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. పట్టణానికి చెందిన అనసూరి దుర్గాప్రసాద్‌కు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన నాగలక్ష్మికి 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దుర్గాప్రసాద్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం బయటి నుంచి ఇంటికి రాగా భార్య నాగలక్ష్మి భోజనం పెట్టకుండా ఫోన్‌లో మాట్లాడుతుండటంతో మందలించారు. మళ్లీ ఆటో నడిపేందుకు బయటకు వెళ్లిపోయారు. మళ్లీ తిరిగి వచ్చేసరికి తలుపు వేసి ఉండటం, ఎంతకూ తీయకపోవడంతో పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా తన భార్య ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉందని దుర్గాప్రసాద్ పోలీసులకు తెలిపారు. నాగలక్ష్మి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ తెలిపారు.

సీఎం సహాయనిధితో పేదలకు మేలు


చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి

సర్పవరం జంక్షన్: ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని, మెరుగైన వైద్య సేవలు అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తెలిపారు. వలసపాకల తెదేపా కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా సూర్యారావుపేటకు చెందిన దూడ దుర్గారావుకు రూ. 77,470 చెక్కును అందించారు. నియోజకవర్గం కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలుసుకుందాం.. అందరినీ ఏకం చేద్దాం


లోగో ఆవిష్కరిస్తున్న పేపకాయల కుటుంబ సభ్యులు

పిఠాపురం: పిఠాపురంలో పేపకాయల కుటుంబ సభ్యులు మంగళవారం కలుసుకుని సరదగా గడిపారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈసారి పిఠాపురంలో కలిశారు. రాష్ట్రంలోని పేపకాయల ఇంటి పేరుగల వారినందరినీ కలిపేందుకు అదే పేరున యూట్యూబ్ ఛానల్‌ను కుటుంబ పెద్ద పేపకాయల సూర్యరాజు ప్రారంభించారు. కుటుంబ అనుబంధాలు, చిన్ననాటి సంగతులు, విజయాలు ఒకరినొకరు పంచుకునేందుకు ఛానల్ వేదిక కానుందన్నారు.

మహిళ అదృశ్యం


నాగవేణి (పాత చిత్రం)

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురంలో అగ్రహానికి చెందిన తన తల్లి రెడ్డి నాగమణి సోమవారం సాయంత్రం తన తండ్రి వెంకటసత్యనారాయణతో గొడవపడి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని కుమారుడు సురేష్ పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బంధువులు ఇళ్ల వద్ద, పట్టణంలో వెదికినా ఆచూకీ తెలియలేదన్నారు. ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విధి నిర్వహణలో సేవలతోనే గుర్తింపు


సీటీఐ రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

సామర్లకోట, న్యూస్‌టుడే: ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అందించిన సేవలు చిరకాలం గుర్తింపునిస్తాయని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రామకృష్ణ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా మంగళవారం స్టేషన్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విదేశాల్లో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లేందుకు ఉద్యోగ విరమణ చేశారన్నారు. పూలమాలలు, శాలువాలతో రామకృష్ణ దంపతులను సత్కరించారు. సీసీఐ సంతోష్‌కుమార్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, వివిధ స్టేషన్‌ల సీటీఐలు విజయ్‌శ్రీను, మౌళి, జీహెచ్‌కే కుమార్, భవానీశంకర్, రమణకుమార్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్ ఇన్‌ఛార్జి చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా డీకేవీఎస్‌పీ చైతన్య బాధ్యతలు స్వీకరించారు.

వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం

తుని పట్టణం: వెంకటేకోట రోడ్డులోని శ్రీసాయి అన్న పూర్ణ వృద్ధాశ్రమంలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆశ్రమానికి నాలుగు సీలింగ్ పంకాలను అందజేశారు. వృద్ధులకు అల్పాహారం, పండ్లు, పాలు ఇచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, అంజనేయప్రసాద్, నూకయ్యశెట్టి, సభ్యులు పాల్గొన్నారు.

సక్రమంగా తాగునీటి సరఫరా

ఏలేశ్వరం: పట్టణంలోని 18, 20 వార్డులను నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం సందర్శించారు. స్థానికులతో కమిషనర్ మాట్లాడుతూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు, తాగు నీరు, వీధి దీపాల సక్రమ నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని కమిషనర్ అన్నారు.

తుని

●తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

వాసవీమాత పురాణ ప్రవచనాలు



ప్రవచనాలను ప్రారంభించిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు

గండేపల్లి(జగ్గంపేట): జగ్గంపేట ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం వాసవీమాత పురాణ ప్రవచనాలను ప్రారంభించినట్లు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త కొండబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ప్రవచాలను బెంగళూరుకు చెందిన వేమా సుబ్రహ్మణ్యం గుప్తా మూడు రోజులపాటు తెలియజేస్తారన్నారు. బొండా వీరసత్య, నాగసత్య, నూకబాబు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సృజనకు పదును



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

తుని, న్యూస్టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను మరింత పెంపొందించడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో అనేక మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో మంగళవారం 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. స్కూలు ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. పోటీల్లో సీహెచ్ యోగిత (10వ తరగతి) ప్రథమ, పి. మౌనిష (8వ తరగతి) ద్వితీయ, పి.ప్రిన్సీ (9వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ కె.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చిట్టిబాబు, ఛాంప్స్ హెచ్ఎం ఎం.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు ఎన్.ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పూడిక తీయక.. పూర్తిగా నీరు నిల్వక..

'ఏలేరు'తో భవిష్యత్తులో వెతలు

ఏలేశ్వరం, న్యూస్టుడే : ప్రతి వర్షపు నీటి బొట్టుని ఒడిసిపట్టి నిల్వ చేసేందుకు నిర్మించిన జలాశయాలు పూర్తి స్థాయి ఫలితాన్ని ఇవ్వట్లేదు. వరద సమయంలో ఎగువ నుంచి వచ్చే మట్టి, ఇసుక మేటలు ప్రాజెక్టుల్లో తిష్ఠ వేస్తున్నాయి. ఈ క్రమంలో ఏటా రిజర్వాయర్లలో పూర్తి స్థాయిలో నీటిని ఉంచలేకపోతున్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో జల వనరుల శాఖ నిర్వీర్యమైంది. కనీసం కాలువల ఆధునికీకరణకు నిధులు కేటాయించని వైకాపా పాలకులు ఇక ప్రాజెక్టుల్లో పూడిక తీతకు ఏ విధంగా కేటాయింపులు చేస్తారంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఏలేశ్వరం ఏలేరు ప్రాజెక్టుని పూడిక ముప్పు వీడడం లేదు. ఫలితంగా ఏలేరు నిర్మాణ లక్ష్యం సమగ్రంగా ప్రయోజనాన్ని చేకూర్చలేకపోతోంది.

విశిష్టతలివీ..

ఏలేశ్వరంలో 1991లో కొండల నడుమ రూ.250 కోట్లతో ఏలేరు జలాశయాన్ని నిర్మించారు. పూర్వపు విశాఖ, మన్యం జిల్లాల నుంచి పలు వాగుల ద్వారా నీరు ప్రాజెక్టుకి చేరేలా నిర్మాణం సాగింది. రిజర్వాయర్ పూర్తి స్థాయి సామర్థ్యం 86.56 మీటర్లు (24.11 టీఎంసీలు.) నిల్వల్లో 12 టీఎంసీలు సాగుకు, మరో ఆరు టీఎంసీల జలాలు విశాఖ మంచి నీరు, ఉక్కు కర్మాగారం అవసరాలకు ఏటా విడుదల చేస్తారు. మెట్టలోని 53 వేల ఎకరాలను ఏలేరు సస్యశ్యామలం చేస్తోంది.



ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయం

పూడికతో ఇబ్బందులిలా..

ఏటా సీజన్లో వచ్చే వరద నీటితో ఇసుక, మట్టి భారీ స్థాయిలో ఏలేరుకు చేరుతున్నాయి. ఏలేరులో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ప్రాజెక్టులో దశాబ్ద కాలం పాటు 24 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేసేవారు. కాని పూడిక ఏటా పెరుగుతుండడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. గడిచిన ఐదేళ్లలో గరిష్ఠంగా 23.10 టీఎంసీల వరకే జలాలను నిల్వ చేస్తున్నారు. సుమారు ఒక టీఎంసీ నీరు ఉండే స్థలాన్ని ఈ పూడికే ఆక్రమించేస్తోంది. ఒక టీఎంసీ నీరు అంటే 10 వేల ఎకరాల సాగుకు సరిపోతోంది. వర్షాలు పడితే సాగుకు ఇబ్బంది ఉండదు. అనావృష్టి ఏర్పడినప్పుడే నీటి ఎద్దడి తప్పదని రైతుల ఆందోళన.

నివారణ ఇలా..

ఏలేరులో పూడిక చేరకుండా పరివాహక ప్రాంతంలో చెక్డ్యామ్ల నిర్మాణం చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. పూడికతో ప్రాజెక్టులు ఏటా 0.5 శాతం నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయని వారు చెబుతున్నారు. పూడిక తొలగింపునకు కేంద్రప్రభుత్వ సాయం తీసుకోవాలి. ప్రాజెక్ట్ భద్రతకు ముప్పు వాటిల్లకుండా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి పూడిక తొలగించాలి. జలాల సరఫరాపై పర్యవేక్షణ చేయాలి. పొదుపుగా నీటిని వాడేలా ప్రజల్లో అవగాహన పెంచాలి.

నిల్వ సామర్థ్యం తగ్గుతుంది

వరదల సమయంలో జలాశయాల్లోకి సాధారణంగా పూడిక చేరుతుంది. దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. ఏలేరు రిజర్వాయర్, జలాశయ సామర్థ్యం తదితర ప్రతీ అంశాన్ని ఏటా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. పూడిక తీత అనే ప్రక్రియ వ్యయంతో కూడుకున్న పని. ఏలేరు వరకు అయితే ప్రస్తుతానికి ఏ విధమైన ఇబ్బందికర పరిస్థితులు లేవు.

- ఎం.భాస్కరరావు, ఈఈ, ఏలేరు జలాశయం, ఏలేశ్వరం.

సత్యదేవుడి దీక్షా వస్త్రాలు అందజేత

ఏలేశ్వరం, న్యూస్టుడే : సత్యదేవుని దీక్ష స్వీకరించిన వారికి సకల శుభాలు కలుగుతాయని ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు అన్నారు. ఏలేశ్వరం సత్యదేవుని ఆలయంలో దీక్షకి సంబంధించిన వస్త్రాలు, పూజా పుస్తకాలు, స్వామి చిత్రపటం, జపమాల తదితరాలను ఆయన స్థానిక కౌన్సిలర్ అలమండ చలమయ్య మంగళవారం అందజేశారు. 27 నుంచి సత్యదీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. స్థానిక ఆలయ అర్చకుడు సత్యనారాయణాచార్యులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్

గండేపల్లి(జగ్గంపేట): జగ్గంపేటలో మంగళవారం జనసేన ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించినట్లు తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం ఈ క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు మాదవరపు వీరబాబు, దొడ్డా శ్రీను, నరేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

శంఖవరం: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బచ్చల గంగ అన్నారు. పెదమల్లాపురంలో 'పల్లె పండుగ'లో భాగంగా మంగళవారం ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

అగరబత్తీ తయారీ కేంద్రం సందర్శన



తయారీ కేంద్రంలో అధికారులు, సిబ్బంది

తుని గ్రామీణం: టి.తిమ్మాపురం గ్రామంలో నిర్వహిస్తున్న అగరబత్తీ తయారీ కేంద్రాన్ని తూర్పుగోదావరి జిల్లా డీఆర్డీఏ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు మంగళవారం సందర్శించారు. అన్నవరం దేవస్థానం వినియోగించిన పూలతో అగరబత్తులు తయారుచేస్తూ ఆదర్శంగా నిలిచిన మహిళా సంఘ సభ్యులతో వారు ముచ్చటించారు. వారికి కేంద్రం నిర్వాహకుడు సూరిబాబు తయారు చేసే విధానాన్ని చేసి చూపించారు. తూర్పుగోదావరి జిల్లా డీఆర్డీఏ పీడీ ఎస్వీవీఎస్ మూర్తి మాట్లాడుతూ.. మహిళా సంఘ సభ్యులను స్వయంఉపాధి మార్గంలో నడిపించేందుకు కుటీర, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఈ సందర్శన చేపట్టామన్నారు.

అధ్వానంగా బీచ్ రహదారి

తొండంగి: యల్లయ్యపేట- దానవాయిపేట బీచ్ రహదారి గుంతలమయంగా మారింది. ఈ రహదారి రోజూ వందల వాహనాలు రాకపోకలు సాగిస్తారు. రాత్రి సమయాల్లో అటుగా ప్రయాణించేవారు గాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొత్త రహదారి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

రమణయ్యపేట రోడ్డు బాగుకు వినతి



మంగళగిరిలో ఎమ్మెల్యే, జనవాణి ఇన్ఛార్జి నానాజీకి వినతిపత్రాన్ని అందిస్తున్న ఏలేశ్వరం అఖిల పక్షం

ఏలేశ్వరం, న్యూస్టుడే : ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్కల్యాణ్ ఆదేశాల మేరకు మంగళగిరిలో జరుగుతున్న జనవాణికి మంగళవారం ఏలేశ్వరం నుంచి అఖిల పక్ష నాయకులు వెళ్లారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి ఆధ్వర్యంలో జై భీమ్రావ్ భారత్ పార్టీ ఏపీ ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు, గిరిజన హక్కుల పోరాట సమితి నాయకుడు ఆనంద్ పాల్ రెడ్డి తదితరులు జనవాణి ఇన్ఛార్జిగా ఉన్న గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీని కలిశారు. ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుంచి జె. అన్నవరం వరకు ఉన్న 13 కి.మీ.ల ర.భ.శాఖ రహదారి గుంతలతో ప్రమాదకరంగా ఉందని తెలిపారు. తక్షణమే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కార్యాలయాల్లోనూ వినతిపత్రాలు అందజేశారు. రోడ్డు మరమ్మతులు జరగకపోతే గతంలో వెల్లడించినట్లు మధ్యలో గోడ నిర్మిస్తామని వారు స్పష్టం చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిద్దాం



రాజా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని కూటమి నేతలు స్పష్టం చేశారు. ప్రత్తిపాడు తెదేపా కార్యాలయంలో కూటమి శ్రేణులతో మంగళవారం సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేసిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు డీవీవీ సత్యనారాయణ భాజపా అధ్యక్షుడు చిలుకూరి రామ్కుమార్, జనసేన ఇన్చార్జి వరుపుల తమ్మయ్యబాబు తదితరులు పాల్గొన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి రాజశేఖర్ను గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రీసర్వేలో సమస్యలు పరిష్కరిస్తాం



గోనేడలో మాట్లాడుతున్న తహసీల్దారు చిరంజీవి

కిర్లంపూడి: భూముల రీసర్వే చేసిన సమయంలో గ్రామాల్లో ఏర్పడిన సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దారు జె.చిరంజీవి పేర్కొన్నారు. గోనేడలో సర్పంచి అల్లు విజయ్ కుమార్ అధ్యక్షతన రీ సర్వే సమస్యలపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో పలువురు రైతులు తమ సమస్యలపై అధికారులకు వినతులు అందజేశారు. గ్రామంలోని దేవాదాయ శాఖకు సంబంధించిన భూముల సమస్యపై మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ అధికారుల దృష్టికి తెచ్చారు. ఉప తహసీల్దారు శ్రావణి, రెవెన్యూ ఇన్స్పెక్టరు సత్యాదేవి, ఇతర శాఖ అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

'వైకాపా హయాంలో అనుయాయులకే స్థలాలు'

గండేపల్లి(జగ్గంపేట): గత ప్రభుత్వంలో నాయకులకు సంబంధించిన వ్యక్తులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని రైతుకూలీ సంఘం రాష్ట్రప్రధాన ప్రధానకార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. జగ్గంపేట కాపుకల్యాణ మండపం వద్ద మంగళవారం రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఇళ్లస్థలాలపై సమావేశం నిర్వహించారు. వీరాంజనేయులు మాట్లాడుతూ.. జగ్గంపేటలో ఇళ్లు లేని పేదలు ఎందరో ఉన్నారని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు.

గ్రామసభకు వినతుల వెల్లువ

తుని గ్రామీణం, న్యూస్టుడే: రీసర్వే చేసిన గ్రామాల్లో భూసమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభకు వినతులు వెల్లువెత్తాయి. చేపూరులో మంగళవారం తహసీల్దారు ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. సబ్డివిజన్లు చేసి భూముల రికార్డులను క్రమబద్ధీకరించాలని రైతులు వినతులు అందించారు. ఆర్ఐ సాయిబాబా, వీఆర్వో అనిత, పాల్గొన్నారు.

తొండంగి: పైడికొండలో గ్రామసభకు 158 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు మురార్జి తెలిపారు. ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రౌతులపూడి: ఎ.మల్లవరంలో ఉప తహసీల్దారు నరేష్, రెవెన్యూ ఇన్స్పెక్టరు దినేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రీసర్వేలో తలెత్తిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని నరేష్ తెలిపారు.

ప్రత్తిపాడు: ఉపప్రణాళిక మన్యంలోని బురదకోట, కొండపల్లి, బాపన్నధార, కె.మిర్తివాడ గ్రామాల్లో రీ సర్వే గ్రామసభలు మంగళవారం జరిగాయి. తహసీల్దారు సూర్యప్రభ గిరిజన రైతుల నుంచి 18 అర్జీలను స్వీకరించారు. ఆవీటిని త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపారు.

చెత్త తొలగింది.. చింత తీరింది

జగ్గంపేట గ్రామీణం, న్యూస్టుడే: మండలంలోని గొల్లలగుంట శివారు కాండ్రేగుల వెళ్లే మార్గంలో రోడ్డుపై వేసిన చెత్తపోగులు తొలగించడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. విశాలమైన రోడ్డు ఉన్నప్పటికి సగం పైగా చెత్తవేయడంతో రోడ్లు అధ్వాన్నంగా మారుతున్నాయి. చెత్తకాస్త రోడ్డుపైకి రావడంతో వాహనదారులు, సమీప కాలనీవాసులు, కాలినడకన వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. ఈనాడులో వచ్చిన కథనాలకు స్పందించిన పంచాయతీ అధికారులు యంత్రాలతో రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించడంతో అపరిశుభ్ర వాతావరణం తొలగింది. సిమెంటు రోడ్డు విశాలంగా కనిపించడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.



గొల్లలగుంటలో రోడ్డుపక్కనే చెత్తకుప్ప



చెత్త తొలగించిన తర్వాత..

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి

తుని: విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు తుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.బాలకోటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్ తదితరులు వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాఘవపట్నం, ములగపూడి, రౌతులపూడి ప్రాంతాల్లో ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులను కలిసి వారితో ముచ్చటించారు. వసతులు ఎలా ఉన్నాయి? మెనూ ప్రకారం ఆహారం అందిస్తోంది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఏ విధమైన ఫిర్యాదులు ఉన్నా తమకు తెలియజేయాలని కోరగా చిన్నారులు పలు సమస్యలు వివరించారు. వీటిని జిల్లా కోర్టుకు పంపుతున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. న్యాయవాదులు గణేష్, రాజేష్, శ్రీనివాస్, కరుణశ్రీ, విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదం.. ముగ్గురు యువకులకు గాయాలు

జగ్గంపేట గ్రామీణం: రామవరం ఎన్హెచ్పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వివరాలివీ.. ముగ్గురు యువకులు మోటారుసైకిల్పై జగ్గంపేట వైపు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీ కొట్టడంతో బోల్తాపడ్డారు. గాయపడ్డ వీరికి హైవే అంబులెన్స్లో జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందిపై కేసు

గండేపల్లి, న్యూస్టుడే: డ్రంక్ అండ్డ్రైవ్ తనిఖీల్లో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. జగ్గంపేటలో-1, గండేపల్లిలో 8 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదుచేసి వారిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. తొమ్మిది మందిలో అయిదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరిపై రూ.10వేలు చొప్పున జరిమానా, నలుగురికి రెండు రోజులు జైలు శిక్షను, జగ్గంపేటలో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన ఇద్దరికి రూ.600 రూపాయల జరిమానాను పెద్దాపురం మెజిస్ట్రేట్ జి.కృష్ణశేషచార్య విధించారని సీఐ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

తుని: వీరవరపుపేటలో ఓ మహిళపై అత్యాచార యత్నం చేసిన నిందితుడు అఖిల్ను కోర్టులో మంగళవారం హాజరుపరిచామని సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపారు. నిందితుడిని ప్రతిఘటించిన మహిళ దాడిచేయగా, పురుషాంగానికి గాయాలు అవ్వడంతో పరారయ్యాడన్నారు. కేసు దర్యాప్తు చేసి అతడ్ని మంగళవారం అదుపులోకి తీసుకుని, చికిత్స అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

అధిక వడ్డీ చెల్లించాలంటూ వేధింపులు



పురుగుమందుతో అమ్మోరు

తొండంగి, న్యూస్టుడే: అధిక వడ్డీ చెల్లించాలంటూ వేధిస్తున్న ఘటనలో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వైరల్ అవుతోంది. వివరాలివీ.. ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన పిల్లి అమ్మోరు స్థానికుడైన నరాల సోమరాజు వద్ద కొంత నగదు అప్పు తీసుకున్నారు. గతంలో గ్రామపెద్దల సమక్షంలో రూ.6.50 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. ఈ మొత్తంలో రూ.3.10 లక్షలు చెల్లించానని మిగిలిన రూ.3.40 లక్షల మొత్తాన్ని రోజుకు రూ.2,400 చొప్పున చెల్లించానని సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. అయినా ఇంకా చెల్లించాలంటూ సోమరాజు వేధింపులకు గురి చేస్తున్నాడని ఇతనికి వనపర్తి సత్తిబాబు వత్తాసు పలుకుతూ రోజు వేధిస్తున్నారని తెలిపారు. తనకు న్యాయం చేయాలంటూ పోలీసుల వద్ద మొత్తుకున్నా పట్టించుకోవట్లేదన్నారు. చివరకు మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇతన్ని కుటుంబసభ్యులు 108 వాహనంలో తుని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

శంఖవరం: రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు బి.వి.ఎస్.హరి అన్నారు. నెల్లిపూడిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పథకాలను అందిపుచ్చుకుని రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. వ్యవసాయాధికారి గాంధీ, ఉద్యానశాఖాధికారి అరుణ్కుమార్, బద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నెల్లిపూడిలో రైతులకు సూచనలిస్తోన్న హరి

తొండంగి: సీతారాంపురంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఏవో నరసింహం హాజరై రైతులకు తెగుళ్ల నివారణపై పలు సూచనలు ఇచ్చారు. రైతులు, వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

తుని గ్రామీణం: వ్యవసాయంలో ఆధునిక విధానం రైతులు అలవర్చుకోవాలని తుని సబ్డివిజన్ ఏడీఏ బుల్లిబాబు సూచించారు. వల్లూరు గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బెంగాల్ నాట్లు వేసే విధానం వల్ల దిగుబడులు పెరిగే విధానం వివరించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ మాధవి మాట్లాడుతూ.. ఎంటీయు 1262 రకం విత్తనాలు సాగు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాన్ని వివరించారు. ఉద్యానశాఖ అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ.. కూరగాయల రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు.

హక్కులను కాలరాస్తే ప్రతిఘటన

ఏలేశ్వరం, న్యూస్టుడే: ప్రజా హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తే ప్రతిఘటన తప్పదని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారావు, పొలిట్బ్యూరో సభ్యుడు శంకర్ అన్నారు. మంగళవారం లిబరేషన్ పార్టీ జిల్లా స్థాయి సదస్సు జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కొరవడిందని, వివిధ వర్గాల సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబరు 4న విజయవాడలో ప్రజా హక్కుల ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పింఛను మినహా మిగిలిన మేనిఫెస్టోను వాయిదా వేస్తోందని సభాధ్యక్షుడు ఏగుపాటి అర్జునరావు దుయ్యబట్టారు.



మాట్లాడుతున్న బంగారావు



పాఠశాల ప్రాంగణాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన పశువుల షెడ్లు, గడ్డిమేట్లు

ఆక్రమణలో పాఠశాల క్రీడాప్రాంగణం

తుని గ్రామీణం, న్యూస్టుడే: రాజుపేట జడ్పీ పాఠశాల క్రీడాప్రాంగణం ఆక్రమణలకు గురవుతుంది. దీంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్ఎం లీలామనోహర్ తెలిపారు. ఆక్రమణదారులు ముందుగానే కోర్టును ఆశ్రయించడం విశేషం. పాఠశాల ప్రాంగణం సుమారు 2.75 ఎకరాలు కాగా సుమారు 30 సెంట్లకు పైబడి స్థలాన్ని ఆక్రమించి పశువుల షెడ్లు, గడ్డిమేట్లు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. 2019లో పాఠశాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టినప్పటికి నిధుల కొరత వల్ల ఒకపక్క నిర్మాణం పూర్తికాలేదు. ఆ ప్రాంతంలోనే ఆక్రమణలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు చెందిన స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రక్షిత నీరు.. గ్రామీణులకు దూరం

● ఎన్టీఆర్ సుజల స్రవంతి వినియోగంలోకి తేవాలి

న్యూస్టుడే, తుని గ్రామీణం.



డి.పోలవరంలో మూతపడిన ఆర్వోప్లాంటు

గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధిచేసిన రక్షిత మంచినీటిని అందుబాటులోకి తెచ్చి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో గత తెదేపా హయాంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం అందుబాటులోకి తెచ్చారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని గాలికొదిలేసింది. దీంతో రూ.లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు, భవనాలు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజలు శుద్ధి చేసిన జలాన్ని ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో అన్న క్యాంటీన్ను పునఃప్రారంభించిన తీరుగా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి పూర్వ వైభవం తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదీ తీరు...

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో వివిధ గ్రామాల్లో సుమారు 14 వరకు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణను సంబంధిత అధికారులు, పంచాయతీల సిబ్బంది పూర్తిగా విస్మరించారు. దీంతో డి.పోలవరం, రేఖవానిపాలెం, వి.కొత్తూరు, కేవో మల్లవరం, దొండవాక, ఏవీ నగరం, గోపాలపట్నం, కేపీ మల్లవరం, అల్లిపూడి, బెండపూడి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు మూతపడ్డాయి. తేటగుంట ఆర్వోప్లాంట్లో మోటారును సైతం తరలించుకుపోవడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాడైన ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తెస్తే శుద్ధజలం కొనుగోలుపై ప్రజలపై పడుతున్న ఆర్థికభారం తగ్గుతుంది. దీంతో గ్రామీణులు రక్షిత నీరు వాడుతూ ఆరోగ్యవంతులుగా ఉంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

గతంలో గ్రామీణ ప్రజలకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు 90 శాతం వరకు మూతపడ్డాయి. ప్రధానంగా నిర్వహణపై దృష్టి సారించకపోవడం, ఆర్వో ప్లాంట్లలో సాంకేతిక లోపాలు రావడంతో పని చేయడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

- శివాజీ, ఏఈ, ఆర్డబ్ల్యూఎస్, తుని మండలం.

జిల్లా టెలికం సలహా సంఘ సభ్యుల నియామకం



తొండంగి: కాకినాడ జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా తొండంగి మండలం పైడికొండ గ్రామానికి చెందిన జనసేన నాయకుడు **పలివెల లోవరాజు**ను నియమిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ ఉత్తర్వులు జారీ చేశారని మంగళవారం లోవరాజు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్, ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాసు, ఎమ్మెల్యే యనమల దివ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.



శంఖవరం: ఉమ్మడి తూర్పుడ గోదావరి జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా శంఖవరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు **మేకల కృష్ణ** నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్ఎన్ఎల్, కేంద్రప్రభుత్వంచే మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్శ్రీనివాస్, పార్టీ అధినేత పవన్కల్యాణ్కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టైరు పేలి అరటి గెలల వాహనం బోల్తా

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్టుడే: ఎన్హెచ్పై టైరు పేలి అరటిగెలల లోడు వ్యాన్ బోల్తా పడింది. హైవే పోలీసులు తెలిపిన వివరాలివీ.. రావులపాలెం నుంచి అన్నవరం వైపుగా అరటిగెలల లోడుతో పూరి వెళ్తున్న వాహనం జగ్గంపేట వంతెన విక్టరీ బజార్ సమీపానికి వచ్చేసరికి వాహనం వెనుక టైరు పేలి బోల్తా పడింది. వ్యాన్లో ఇద్దరు డ్రైవర్లు బాగానే ఉన్నారని హైవే పోలీసులు తెలిపారు.